



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 247 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : ఒంగోలు | మంగళవారం 12 మే 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :247 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : ONGOLE | TUE 12 MAY 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు
## అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

- 1998 పోక్రాన్ అణు పరీక్షలను గుర్తుచేస్తూ మోదీ కీలక వ్యాఖ్యలు
- సోమనాథ్ ఆలయ 75వ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రధాని
- బుజ్జగింపు రాజకీయాలపై ప్రతిపక్షాలను విమర్శించిన మోదీ
- సోమనాథ్ పునరుద్ధరణ భారత సాంస్కృతిక స్వేచ్ఛకు ప్రతీక అని వెల్లడి

మిగతా 2లో

## ఈసారి యుద్ధం మామూలుగా ఉండదు
## భారత్‌కు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ బెదిరింపులు



పెన్ పవర్ డెస్క్:పాకిస్తాన్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్ మరోసారి భారత్‌పై ఆక్రోశం వెళ్లగక్కారు. భవిష్యత్‌లో పాకిస్తాన్‌పై ఇండియా ఎలాంటి దాడులకు పాల్పడిన ప్రతిదాడి మూమూలుగా ఉండదని ప్రగల్భాలు పలికారు. ఇండియా తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సి ఉంటుందని హెచ్చరించారు. రావల్పిండిలోని జనరల్ హెడ్ క్వార్టర్స్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో మునీర్ మాట్లాడుతూ.. "భవిష్యత్తులో ఇండియా పాకిస్థాన్‌పై ఏదైనా దుశ్చర్యకు

మిగతా 2లో



## 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం
### నిమ్మల రామానాయుడు

- ఏపీని కరవు రహితంగా మార్చడంలో పోలవరం కీలకమన్న నిమ్మల
- గోదావరి, కావేరి అనుసంధానంపై ప్రభుత్వం దృష్టి సారించిందని వెల్లడి
- గోదావరి నుంచి ప్రతి ఏటా 3 వేల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందన్న మంత్రి

మిగతా 2లో

# ఇది జాతీయ టాస్క్... ప్రతి ఒక్కరూ స్వీకరించాలి
## సీఐఐ సదస్సులో చంద్రబాబు



- ప్రధాని మోదీ ఇచ్చిన 8 సూత్రాల జాతీయ మిషన్‌ను వివరించిన చంద్రబాబు
- మోదీ నేతృత్వంలో భారత్ అగ్రస్థానానికి చేరుతుందని ధీమా
- ప్రకృతి సేద్యం ద్వారా ఎరువుల దిగుమతి తగ్గించవచ్చని సూచన
- ఏపీలో 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నామని వెల్లడి
- దేశం, రాష్ట్ర ప్రయోజనాలే తన అజెండా అని స్పష్టీకరణ




పెన్ పవర్ డెస్క్:దేశ స్వయం సమృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రజల ముందుంచిన 8 అంశాల జాతీయ మిషన్‌ను ప్రతిఒక్కరూ స్వీకరించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ఢిల్లీలోని తాజ్ ప్యాలెస్‌లో జరిగిన సీఐఐ బిజినెస్ సమ్మిట్‌లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని ప్రతిపాదించిన 8 సూత్రాలను కూలంకషంగా వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు బంగారం కొనుగోళ్లను కొంతకాలం వాయిదా వేయాలని ప్రధాని పిలుపునిచ్చినట్లు చంద్రబాబు గుర్తుచేశారు. ఇంధనాన్ని పొదుపుగా వాడాలని, అదే సమయంలో ప్రతి ఇల్లు, పరిశ్రమ, పొలం ఒక విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మారాలని సూచించారు. యుద్ధానంతర పరిస్థితుల వల్ల గ్యాస్ సరఫరాలో తలెత్తిన ఇబ్బందులను అధిగమించేందుకు ప్రజా రవాణా వినియోగాన్ని పెంచడం కీలకమన్నారు. దేశంలో మెరుగైన మౌలిక సదుపాయాలు ఉన్నందున, 'వర్క్ ఫ్రమ్ హోమ్' విధానాన్ని ప్రోత్సహించాలని ప్రధాని సూచించినట్లు తెలిపారు. వీటన్నింటి ద్వారా 'గ్రేటర్ సెల్ఫ్ రిలయన్స్' (సంపూర్ణ స్వావలంబన) సాధించడం సాధ్యమవుతుందని, ఇందులో భాగంగా ప్రకృతి సేద్యం కీలక పాత్ర పోషిస్తుందని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రకృతి సేద్యం వల్ల ఎరువుల దిగుమతి తగ్గి దేశం స్వయం సమృద్ధి సాధిస్తుందని అన్నారు. మొతమ్మీద ఇది ఒక జాతీయ టాస్క్ అని, దీన్ని అందరూ కలిసికట్టుగా సాధించాలని ఆయన కోరారు.

### మోదీ నాయకత్వంలో భారత్ అగ్రగామి

దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడిగా ప్రధాని నరేంద్ర మోదీ లభించారని చంద్రబాబు ప్రశంసించారు. సంస్కరణల వాది అయిన మోదీ నేతృత్వంలో భారత్ ప్రపంచంలో అగ్రస్థానానికి చేరుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో సుస్థిరమైన ప్రభుత్వాలు

మిగతా 2లో



## మూడో ప్రత్యామ్నాయం... ఏపీకి విశ్వసనీయ పార్టీ కావాల్సిందే

- ఏపీకి మూడో ప్రత్యామ్నాయం అవసరమన్న విజయసాయి రెడ్డి
- రాష్ట్ర రాజకీయాలు రెండు తీవ్ర ధోరణుల మధ్య చిక్కుకున్నాయని వ్యాఖ్య
- టీడీపీది పట్టణ పక్షపాతమని, వైసీపీది కేవలం సంక్షేమమని విమర్శ
- అభివృద్ధి, సంక్షేమాన్ని సమన్వయం చేసే నాయకత్వం రావాలని ఆకాంక్ష

పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజకీయాలపై మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రానికి ఇప్పుడు ఒక బలమైన మూడో ప్రత్యామ్నాయం అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

మిగతా 2లో

## నేడు అనంతపురం జిల్లాకు వెళ్లనున్న జగన్



- పామిడిలో ఒక వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరుకానున్న జగన్
- అనంతరం తాడేపల్లికి బయల్దేరనున్న వైసీపీ అధినేత
- జగన్ రాక సందర్భంగా భారీ ఏర్పాట్లు చేస్తున్న వైసీపీ శ్రేణులు

మిగతా 2లో

## తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియామకం

- ఆరుగురు సభ్యులను కూడా నియమించిన ప్రభుత్వం
- సభ్యుల్లో కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత తదితరులు
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ ప్రభుత్వం

మిగతా 2లో



## మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు

- నెల రోజుల పాటు వాడవాడలా టీఆర్ఎస్ జెండా పండుగలు
- రాజధాని నుంచి గ్రామస్థాయి వరకు జెండా పండుగ
- పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు జెండా పండుగ

మిగతా 2లో




## చెన్నైలో స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్



- తమిళనాడు సీఎం విజయ్, మాజీ సీఎం స్టాలిన్‌తో భేటీ
- ఎమ్మెల్యేగా ప్రమాణం చేశాక స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం
- విజయ్‌ను ఆలింగనం చేసుకుని శాలువాతో సత్కరించిన స్టాలిన్
- ఈ సమావేశంలో ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్న వైనం

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్.. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ఆయన నేరుగా చెన్నైలోని స్టాలిన్ నివాసానికి వెళ్లారు. తన నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి విజయ్‌ను స్టాలిన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకుని, శాలువాతో సత్కరించారు. ఈ భేటీలో స్టాలిన్ కుమారుడు,

మిగతా 2లో

## చంద్రబాబు ఇంటి పక్కన ఎవరూ నివసించకూడదని ఇలా చేస్తున్నారా?

- చంద్రబాబు ఇంటి సమీపంలోని స్థలాన్ని గ్రీన్ బెల్ట్ గా ప్రకటించారన్న పేర్ని నాని
- రెసిడెన్షియల్ ఏరియాగా ఉన్న ఆ ప్రాంతం అకస్మాత్తుగా గ్రీన్ బెల్ట్‌గా ఎలా మారుతుందని ప్రశ్న
- అమరావతిని అవినీతికి కేంద్రంగా మార్చేశారని విమర్శ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై చేసిన విమర్శలు రాజకీయంగా దుమారం రేపుతు న్నాయి. ముఖ్యంగా అమరావతి రాజధాని ప్రాంతంలో చంద్రబాబు నిర్మించుకుంటున్న నివాసం మరియు అక్కడ జరుగుతున్న ప్లాట్ల కేటాయింపులపై

మిగతా 2లో



## ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్నారు.. తెలంగాణకు ఏం ఇచ్చారు?

- జనగణన ఫారమ్‌లలో లోపాలు ఉన్నాయన్న పొన్నం
- బీసీలను విస్మరించారని విమర్శ
- గత 12 ఏళ్లలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధమని సవాల్

మిగతా 2లో

## జులై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ' చట్టం



- గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ
- కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు అంతరాయం కలగకుండా చర్యలు
- కొత్త కార్డులు జారీ అయ్యే వరకు ఎంజీనరేగా కార్డులు చెల్లుబాటు

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

# మోడీ చెప్పినట్లే లైఫ్ స్టైల్ మార్చేయటం ఈజీనా?

దేశ ప్రజలకు ఎంతో ఇష్టమైన పనిని చేయొద్దని దేశ ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. కాసిన్ని డబ్బులు చేతిలో ఉంటే.. మొదటి ఆలోచన బంగారం కొనటంపైనే ప్రతి ఒక్కరు ఆలోచిస్తారు. పెళ్లిళ్లు మొదలు కొని ప్రత్యేకంగా జరుపుకునే ఫ్యామిలీ ఫంక్షన్ల వరకు అన్నింటిలోనూ బంగారం కొనుగోలు చేయటం కనిపిస్తూ ఉంటుంది. బంగారానికి.. భారతీయులకు ఉన్న అనుబంధం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అలాంటి బంగారం కొనుగోలు మీద ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రజలు ఏడాది పాటు బంగారం కొనుగోలు చేయకపోవటం మంచిదన్న ఆయన.. అందుకు కారణాన్ని చెప్పుకొచ్చారు. పశ్చిమాసియా యుద్ధం కారణంగా బంగారం అత్యంత ఖరీదైందిగా మారిందన్న ప్రధాని మోడీ.. విలువైన విదేశీ మారకద్రవ్యం పోతుందన్నారు. అక్కడితో ఆగని ఆయన పెట్రోల్.. డీజిల్ తో పాటు.. విదేశీ ప్రయాణాలు.. దుబారా ఖర్చుల్నిపూర్తిగా తగ్గించుకోవాలన్నారు. పెట్రోల్.. డీజిల్ ను పరిమితంగా వినియోగించాలన్న ఆయన.. అందులో భాగంగా ప్రజలు ప్రజా రవాణాను అధికంగా వాడాలని పిలుపునిచ్చారు. ఈ మాటలన్ని కూడా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్ లో బీజేపీ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో చెప్పారు. పెట్రోలో.. డీజిల్.. గ్యాస్.. యూరియా ధరలు అమాంతంగా పెరిగినప్పటికి ప్రజలపై భారం పడకూడదన్న ఉద్దేశంతో ధరలు పెంచలేదన్న మోడీ.. ప్రస్తుతం ప్రపంచం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటోందని చెబుతూ తాజాగా జరుగుతున్న యుద్ధాలను గురించి చెప్పుకొచ్చారు. ఈ యుద్ధాలతో సరఫరా చైన్ దెబ్బతిందని.. సదరు నష్టాల్ని కేంద్రమే భరిస్తోందన్న ఆయన.. వంటనూనెలు.. ఎరువుల మందుల వినియోగాన్ని తగ్గించాలని ప్రజల్ని కోరారు. మోడీ కోరినట్లుగా బంగారాన్ని ఏడాది పాటు కొనుగోలు చేయకుండా ఉండటం సాధ్యమేనా? అంటే అంత తేలికైన పని కాదని చెప్పాలి. ఎందుకంటే.. భారతీయుల్లో అత్యధికులు బంగారాన్ని కొనుగోలు చేయటానికి చాలా ముందు నుంచే ప్లానింగ్ చేస్తుంటారు. ముఖ్యంగా ఫంక్షన్ల సమయంలో కొనుగోలు చేయాలని భావించే బంగారాన్ని వాయిదా వేయటం అంత తేలికైన విషయం కాదు. బంగరాన్ని భవిష్యత్ పెట్టుబడిగా.. పొదుపుగా.. ఫ్యూచర్ అవసరాలకు సాయం చేసేదిగా భావిస్తారు. అలాంటప్పుడు బంగారాన్ని కొనటం తగ్గించమన్న ప్రధాని మోడీ మాటలకు ప్రభావం అంతగా ఉండకపోవచ్చనే చెప్పాలి. ఒకవేళ.. ఆయన మాటల్ని ప్రజలు సీరియస్ గా తీసుకోవాలంటే అందుకు బదులుగా ఏదైనా తాయిలాన్ని ప్రకటిస్తే మంచిది. అదెలా అంటే.. ఉదాహరణకు బంగారం మీద ఇప్పుడున్న పన్నులను ఏడాది తర్వాత తగ్గించే విషయంతో పాటు.. బంగారం కొనుగోలుతో వచ్చే ధీమాకు సరిపడా కేంద్ర సర్కారు ప్రజలకు ఇవ్వగలిగితే.. ఆయన మాటల్ని పెద్ద ఎత్తున వినే వీలుంది. అదేం లేకుండా.. బంగారాన్ని కొనొద్దంటే.. కొనకుండా ఉండటం అంత తేలికైన విషయం కాదన్నది మర్చిపోకూడదు.

## మూడో ప్రత్యామ్నాయం... ఏపీకి విశ్వసనీయ పార్టీ కావాల్సిందే

- **మొదటి పేజి తరువాయి**

ఈ మేరకు ఆయన చేసిన తాజా ట్వీట్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర రాజకీయాలు రెండు విచిత్ర ధోరణుల మధ్య చిక్కుకుపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి టీడీపీ, వైసీపీల విధానాలను విమర్శించారు. "ఒకవైపు గ్రామీణ ప్రాంతాలను విస్మరించే టీడీపీ పట్టణ కేంద్రీకృత దృక్పథం, మరోవైపు అభివృద్ధిపై దార్శనికత లేని వైసీపీ కేవలం సంక్షేమ విధానం.. ఈ రెండు తీవ్ర ధోరణుల మధ్య ఏపీ రాజకీయాలు నలిగిపోతున్నాయి" అని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రానికి ఎలాంటి నాయకత్వం అవసరమో కూడా ఆయన స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమాలను సమన్వయం చేసే విశ్వసనీయమైన మూడో ప్రత్యామ్నాయం ఏపీకి కావాలని ఆయన ఆకాంక్షించారు. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షిస్తూనే, వాటి ఫలాలను రాష్ట్రంలోని ప్రతీ ప్రాంతానికి చేరేలా చూసే నాయకత్వం రావాలని విజయసాయి రెడ్డి తన ట్వీట్‌లో వివరించారు. ఇటీవలే విజయసాయిరెడ్డి తాను కొత్త పార్టీ పెడతానని సూచనప్రాయంగా వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన తాజా ట్వీట్ ప్రాధాన్యత సంతరించుకుంది.

## చెన్నైలో స్టాలిన్ నివాసానికి వెళ్లిన సీఎం విజయ్

- **మొదటి పేజి తరువాయి**

మాజీ మంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు.
డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎంల మద్దతుతోనే విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చే విషయంలో తమ మిత్రపక్షాలకు స్టాలిన్ పూర్తి స్వేచ్ఛ కల్పించారు. ఈ నేపథ్యంలోనే, ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు పరోక్షంగా సహకరించిన స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకే విజయ్ ఆయనను కలిసినట్లు తెలుస్తోంది. సీఎం బాధ్యతలు చేపట్టాక విజయ్, స్టాలిన్‌ను కలవడం ఇదే తొలిసారి. ఈ భేటీ తమిళ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించింది.

# నేడు అనంతపురం జిల్లాకు వెళ్లనున్న జగన్

వైసీపీ అధినేత జగన్ నేడు అనంతపురం జిల్లాలో పర్యటించనున్నారు. యూరప్ పర్యటన ముగించుకుని స్వదేశానికి వచ్చిన తర్వాత ఆయన చేపడుతున్న మొదటి జిల్లా పర్యటన ఇదే కావడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. రేపు మధ్యాహ్నం ఆయన అనంతపురం జిల్లాలోని పామిడికి చేరుకుంటారు. ఎమ్మెల్సీ మధుసూదన్ కుమారుడు చైతన్య మిత్ర, వైసీపీ నేత పామిడి వీరా కుమార్తె, ఏడీసీసీ బ్యాంకు మాజీ ఛైర్‌పర్సన్ లిఖితల వివాహ రిసెప్షన్ వేడుకకు ఆయన హాజరుకానున్నారు. గుంతకల్లు నియోజకవర్గం పరిధిలోని పామిడిలో నిర్వహించనున్న ఈ వేడుకలో పాల్గొని, నూతన వధూవరులను జగన్ ఆశీర్వదించనున్నారు. జగన్ రాకను పురస్కరించుకుని పామిడిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పార్టీ కీలక నేతలందరూ ఈ వేడుకకు తరలివచ్చే అవకాశం ఉంది. భద్రతా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ కార్యక్రమం ముగిసిన అనంతరం ఆయన తాడేపల్లికి బయల్దేరుతారు.

## చంద్రబాబు ఇంటి పక్కన ఎవరూ నివసించకూడదని ఇలా చేస్తున్నారా?

- **మొదటి పేజి తరువాయి**

ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఏపీ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటిని నిర్మించుకుంటున్న సంగతి తెలిసిందే. ఇంటి నిర్మాణం దాదాపుగా పూర్తి అవుతోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబుపై వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని విమర్శలు గుప్పించారు. చంద్రబాబు కడుతున్న ఇంటి సమీపంలో సుమారు 3800 గజాల భూమిని 'గ్రీన్ బెల్ట్'గా ప్రకటించడంపై పేర్ని నాని అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో రెసిడెన్షియల్ ఏరియాగా ఉన్న ఆ ప్రాంతం అకస్మాత్తుగా గ్రీన్ బెల్ట్‌గా ఎలా మారుతుందని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు ఇంటి పక్కన ఇతరులెవరూ నివసించకూడదనే ఉద్దేశంతోనే ఇలా చేస్తున్నారా అని నిలదీశారు. సాధారణ రైతులకు ఇవ్వని ప్రాధాన్యత చంద్రబాబు బినామీలకు మాత్రం అమరావతిలో దక్కుతోందని ఆరోపించారు.

సచివాలయం, అసెంబ్లీ, హైకోర్టు వంటి కీలక భవనాల మధ్యలోనే చంద్రబాబుకు ప్లాటు ఎలా కేటాయిస్తారని ఆయన ప్రశ్నించారు. ఈ నివాసాన్ని ఏ రకమైన 'ప్యాలెస్' అని పిలవాలని ఎద్దేవా చేశారు. రాజధానిని అవినీతికి కేంద్రంగా మార్చేశారని విమర్శిస్తూ, రైతులకు చెందాల్సిన న్యాయం కేవలం కొందరికే పరిమితం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధాని నిర్మాణంలో పారదర్శకత లేదని, కేవలం సొంత ప్రయోజనాల కోసమే నిర్ణయాలు జరుగుతున్నాయని ఆయన విమర్శించారు.

# భారత్‌ను లొంగదీసే శక్తి ఈ ప్రపంచంలో లేదు అణు పరీక్షలపై ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు

భారత్‌ను తలవంచేలా చేసే శక్తి ప్రపంచంలో ఏదీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 1998లో పోఖ్రాన్‌లో జరిపిన అణు పరీక్షలను గుర్తుచేస్తూ, భారత సంకల్పం ఎంత దృఢమైనదో ప్రపంచానికి ఆనాడే తెలిసొచ్చిందని అన్నారు. సోమవారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో జరిగిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్' వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 1998 మే 11న భారత శాస్త్రవేత్తలు పోఖ్రాన్‌లో అణు పరీక్షలు జరిపి దేశ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆ పరీక్షల తర్వాత ప్రపంచ దేశాలు మనపై అనేక ఆంక్షలు విధించి, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూశాయని అన్నారు. అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని, మే 13న మరోసారి పరీక్షలు జరిపి తన రాజకీయ సంకల్పాన్ని నిరూపించుకుందని వివరించారు. "మనం వేరే మట్టితో తయారైన వాళ్ళం" అంటూ ఆనాటి ధైర్యాన్ని కొనియాడారు. సోమనాథ్ ఆలయం గురించి మాట్లాడుతూ.. 75 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునరుద్ధరణ కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదని, అది భారత సాంస్కృతిక స్వేచ్ఛా ప్రకటన అని మోదీ అభివర్ణించారు. చరిత్రలో ఎన్నోసార్లు ఆలయాన్ని ధ్వంసం చేసినా, ప్రతిసారీ పునర్నిర్మించామని, ఇది భారత విశ్వాసానికి ఉన్న బలమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ నిర్మాణంలోనూ బుజ్జగింపు రాజకీయాలు జరిగాయని, సర్దార్ పటేల్ వంటి వారి ప్రయత్నాలను నెహ్రూ వ్యతిరేకించారని విమర్శించారు. ఇదే తరహా రాజకీయాలు అయోధ్య రామమందిర నిర్మాణం విషయంలోనూ కొనసాగాయని అన్నారు. పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆలయంలో విశేష మహా పూజ, కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హెలికాప్టర్ల ద్వారా ఆలయ గోపురంపై పూలవర్షం కురిపించారు.

# 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తాం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అభివృద్ధిలో అత్యంత కీలకమైన పోలవరం ప్రాజెక్టు నిర్మాణ గడువుపై నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కీలక ప్రకటన చేశారు. పీపీఏ, సీడబ్ల్యూసీ నిర్దేశించిన గడువు ప్రకారం 2027 జూన్ నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి ప్రకటించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కలిసి ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారని తెలిపారు.
గత ఏప్రిల్ నాటికే కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం పూర్తవ్వడం ప్రాజెక్టు నిర్మాణం వేగానికి సంకేతమని పేర్కొన్నారు. తొలి దశలో 41.15 మీటర్ల ఎత్తు వరకు నీటిని నిల్వ చేసేలా నిర్మాణ పనులకు పూర్తి సహకారం అందించాలని చంద్రబాబు కేంద్రాన్ని కోరినట్టు నిమ్మల తెలిపారు. ఏపీని కరవు రహిత రాష్ట్రంగా మార్చడమే తమ లక్ష్యమని మంత్రి చెప్పారు. గోదావరి–కావేరి అనుసంధానంపై ప్రభుత్వం దృష్టి సారించిందని వెల్లడించారు. ప్రతి ఏటా గోదావరి నుంచి సుమారు 3000 టీఎంసీల వరద నీరు వృథాగా సముద్రంలో కలుస్తోందని,
ఈ నీటిని మళ్లించడం ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దక్షిణాది రాష్ట్రాలకు భారీ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. దీనికి సంబంధించి ఒక పక్కా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. భూగర్భ జలాల పెంపు కోసం విజయనగరంలో ప్రయోగాత్మకంగా ఎంసీఏడీ మోడల్ సిస్టమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.

# తెలంగాణ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియామకం

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గద్వాల విజయలక్ష్మి నియమితులయ్యారు. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్, ఆరుగురు సభ్యులను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేత, శశికళ యాదవ రెడ్డి, సదాలక్ష్మి, రాధాబాయి, ఉజ్మా షకీరాలను నియమించారు. వీరి పదవీకాలం ఐదేళ్ల పాటు ఉంటుందని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.
తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ రాష్ట్రంలోని మహిళల హక్కులను పరిరక్షించడానికి, వారిపై జరుగుతున్న అన్యాయాలు, వేధింపులను అరికట్టడానికి ఏర్పాటు చేయబడిన చట్టబద్ధమైన సంస్థ. ఇది మహిళలకు న్యాయం చేకూర్చడం, సంక్షేమం మరియు సాధికారత కోసం పనిచేస్తుంది.

# ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్నారు.. తెలంగాణకు ఏం ఇచ్చారు?

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన, హౌస్ హోల్డ్ సర్వే ఫారమ్‌లలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సర్వే ఫారమ్‌లో కేవలం ఎస్సీ, ఎస్టీ అనే ఆప్షన్లు మాత్రమే ఉన్నాయని, మెజారిటీ జనాభా కలిగిన బీసీల ప్రస్తావనే లేకపోవడం వారిని విస్మరించడమేనని మండిపడ్డారు. బీసీల అభివృద్ధికి కులగణన అత్యవసరమని, కేంద్రం ఈ విషయంలో వివక్ష చూపుతోందని ఆయన విమర్శించారు. తెలంగాణపై కేంద్రం చూపుతున్న వివక్షపై స్పందించాలని రాష్ట్ర బీజేపీ నేతలకు మంత్రి సవాల్ విసిరారు. గత 12 ఏళ్లలో కేంద్రం నుంచి తెలంగాణకు వచ్చిన నిధులపై సికింద్రాబాద్ క్లాక్ టవర్ వద్ద లేదా మరెక్కడైనా సరే బహిరంగ చర్చకు తాను సిద్ధమని ప్రకటించారు. ఏపీకి అడిగినన్ని నిధులు ఇస్తున్న కేంద్రం, తెలంగాణకు ఎన్ని నిధులు తెచ్చారో బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ తెలంగాణ పర్యటనపై స్పందిస్తూ, "రాష్ట్రానికి ఏం ప్రాజెక్టులు ఇస్తారో చెప్పకుండా, బంగారం కొనొద్దు అని సలహాలు ఇవ్వడానికే మోదీ వచ్చారా?" అని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు అనేకసార్లు కేంద్ర మంత్రులను కలిసి విన్నవించినా నిధుల విడుదలపై స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాముడిని తాము కూడా పూజిస్తామని, అయితే బీజేపీలాగా ఓట్ల కోసం దేవుడిని వాడుకోమని స్పష్టం చేశారు.

# మే 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగలు

తమ పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు నెల రోజుల పాటు వాడవాడలా జెండా పండుగలు నిర్వహించనున్నట్లు కవిత నేతృత్వంలోని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) ప్రకటించింది. ఈ మేరకు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా మే 20 నుండి జూన్ 20 వరకు రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాలతో పాటు నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి వరకు పెద్ద ఎత్తున టీఆర్ఎస్ జెండా పండుగ నిర్వహిస్తామని తెలిపింది. పార్టీ ఆవిర్భావ సభలో తెలిపిన పార్టీ విధానాలను, పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు వివరిస్తారని వెల్లడించింది. నేడు తెలంగాణ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎక్కడికక్కడ గళమెత్తవలసిందిగా పార్టీ నాయకులను కార్యకర్తలకు ఇప్పటికే సూచించినట్లు తెలిపింది. అందులో భాగంగా రాష్ట్రస్థాయి అంశాలతో పాటు స్థానిక సమస్యల పట్ల కూడా అక్కడి శ్రేణులు స్పందించడం, అవసరమైనచోట పోరాటానికి సిద్ధంగా ఉంటారని తెలిపింది. టీఆర్ఎస్ జెండా పండుగలో భాగంగా కార్యకర్తలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరువ కావాలని పిలుపునిచ్చింది. కలిసి వచ్చే వారిలో సమాజం పట్ల బాధ్యత, అంకితభావం కలిగిన చురుకైన కార్యకర్తలతో సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపింది. రాజకీయ చైతన్యం నిండిన ఒక బలమైన జన సమూహాన్ని ప్రజా ఉద్యమాల కోసం నిర్మిద్దామని పిలుపునిచ్చింది.

## ఈసారి యుద్ధం మామూలుగా ఉండదు భారత్‌కు పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ బెదిరింపులు

- **మొదటి పేజి తరువాయి**

పాల్పడితే ప్రతిదాడి ప్రభావం పరిమితంగా ఉండదు. అత్యంత విస్తృతంగా, ప్రమాదకరంగా, సుదూరంగా, బాధాకరంగా ఉంటుందని మన శత్రువులు తెలుసుకోవాలి" అని అన్నారు.
2025 మేలో ఇండియా, పాక్ మధ్య జరిగిన సంఘర్షణలో భారత్ కంటే పాకిస్తాన్ అవలభించిన వ్యూహాలే మెరుగైనవని బీరాలు పలికారు. గత సంవత్సరం జరిగిన సైనిక ఘర్షణ సమయంలో పాకిస్థాన్ సార్వభౌమత్వాన్ని దెబ్బతీయడానికి భారత్ విఫలయత్నం చేసిందని.. భారత్ చర్యలను పాకిస్తాన్ పూర్తి జాతీయ ఐక్యత, సైనిక బలంతో తిప్పికొట్టిందని పేర్కొన్నారు. రెండు అణుశక్తి దేశాల మధ్య సంఘర్షణ కేవలం రెండు దేశాలు, సైన్యాల మధ్య జరిగే సాంప్రదాయ యుద్ధం మాత్రమే కాదని, వాస్తవానికి అది రెండు సిద్ధాంతాల మధ్య జరిగిన యుద్ధమని.. ఈ యుద్ధంలో అల్లా దయవల్ల సత్యం గెలిచి. అసత్యం ఓటమి ఓటమి పాలైందని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. 2025, మేలో ఇండియా, పాక్ మధ్య తలెత్తిన సైనిక ఘర్షణ ఆకస్మికంగా జరిగింది కాదని.. అది ఇండియా ఎత్తుగడలో భాగమని ఆరోపించారు. కాగా, పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా 2025 మే నెలలో ఇండియా చేపట్టిన ఆపరేషన్ సిందూర్?కు ఏడాది పూర్తి అయిన సందర్భంగా అసిమ్ మునీర్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

## ఇది జాతీయ టాస్క్... ప్రతి ఒక్కరూ స్వీకరించాలి

- **మొదటి పేజి తరువాయి**

ఉన్నాయని, ఇది అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఒకప్పుడు దేశానికే ఆదర్శంగా నిలిచిన పశ్చిమ బెంగాల్, గత కొంతకాలంగా అభివృద్ధి ఆలోచనలే లేకుండా వెనుకబడిపోయిందని ఆయన అభిప్రాయపడ్డారు.
1990లలో పీవీ నరసింహారావు ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలు దేశానికి ఎన్నో అవకాశాలు కల్పించాయని, టెలికాం, విద్యుత్, రహదారుల రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. ఆ సంస్కరణల్లో తాను కూడా భాగస్వామిని కావడం సంతోషంగా ఉందన్నారు.

**ఆదర్శంగా ఆంధ్రప్రదేశ్**

ప్రధాని ఆశయాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ఇప్పటికే పలు చర్యలు చేపడుతోందని చంద్రబాబు వివరించారు. రాష్ట్రంలో 'ప్రోజ్యూమర్' (ఉత్పత్తిదారు–వినియోగదారు) విధానాన్ని ప్రోత్సహిస్తున్నామని, సోలార్ రూఫ్‌టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నామని తెలిపారు. మైక్రో గ్రిడ్ వ్యవస్థ ద్వారా విద్యుత్ సరఫరా నష్టాలను తగ్గిస్తున్నామన్నారు.
రాష్ట్రంలో ఇప్పటికే 20 లక్షల మంది రైతులు 20 లక్షల ఎకరాల్లో ప్రకృతి సేద్యం చేస్తున్నారని, దీని ద్వారా భూసారాన్ని పెంచుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నామని వివరించారు. ప్రతీ సవాలు ఒక అవకాశాన్ని సృష్టిస్తుందని, భారత్ ఎదుగుదలను ఎవరూ ఆపలేరని (అన్‌స్టాపబుల్), త్వరలోనే దేశం ఒక గ్లోబల్ జెయింట్‌గా మారుతుందని చంద్రబాబు అన్నారు. దేశ, రాష్ట్ర ప్రయోజనాలే తన అజెండా అని ఆయన స్పష్టం చేశారు.

## జులై 1 నుంచి 'వీబీ జీ రామ్ జీ' చట్టం

జీవనోపాది భద్రత, గ్రామీణ ప్రజల ఆదాయ కల్పన కోసం 'వీబీ జీ రామ్ జీ' చట్టాన్ని జులై 1వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను రద్దు చేసి దాని స్థానంలో కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారత్ గ్యారంటీ పర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్–గ్రామీణ్ (వీబీ–జీ–రామ్–జీ)ను తీసుకువచ్చింది. ఈ కొత్త చట్టాన్ని జులై నుంచి అమలు చేయనున్నట్లు వెల్లడించింది. దీని ద్వారా గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల చట్టబద్ధమైన వేతన ఉపాధికి హామీ లభిస్తుందని తెలిపింది. జీవనోపాధి భద్రత, గ్రామీణ ప్రజలకు ఆదాయ కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి, గ్రామీణ ప్రజల్లో పరివర్తనను తీసుకురావడమే ఈ చట్టం లక్ష్యమని గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ తెలిపింది. కొత్త విధానానికి మారే క్రమంలో కార్మికులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. కొత్త గ్రామీణ రోజ్‌గార్ గ్యారెంటీ కార్డులు జారీ అయ్యే వరకు ప్రస్తుతం ఉన్న ఈ–కేవైసీ ఎంజీనరేగా కార్డులు చెల్లుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. జాబ్ కార్డులు లేని కార్మికులు గ్రామ పంచాయతీలో నమోదు చేసుకోవాలని సూచించింది. వేతన చెల్లింపులు, ఫిర్యాదుల పరిష్కారం, పని కేటాయింపు నిబంధనలు, పరిపాలనా వ్యయం వంటి ఇతర అంశాల గురించి రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ తెలిపింది.



# సైట్ మారినా..
# సందు వదలని ఫీల్డ్ అసిస్టెంట్లు ..!

**ఉపాధి హామీలో అవినీతిని**
**అరికట్టడంలో అధికారులు విఫలం**
**ఫీల్డ్ అసిస్టెంట్లు తెలివి తేటలు**
**ముందు.. టెక్నాలజీ చిన్నబోయింది**
**ఆగని 100 వసూళ్ళ దందా.?**
**కూలోళ్ళ కడుపు కొడుతున్న అక్రమార్కులు**
**కిందనుంచి పై వరకు మామూళ్ళ పర్వం**



**పీసీపల్లి, పెన్ పవర్ మే 11**

కొత్త సాంకేతికను అందిపుచ్చుకొని ఉపాధి హా మీ పథకంలో అవినీతిని నిర్మూలించేందుకు తీసుకొచ్చిన ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) యాప్ ఫీల్డ్ అసిస్టెంట్లు తెలివి తేటలు ముందు చిన్నబోయింది. యాప్లో ఉన్న లొసుగుల ను తెలుసుకొని కొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి హామీ పథకంలో కొత్త ట్రెండ్ అవినీతికి తెరలేపారు. ఉపాధి హామీ పథకంలో గతంలో మస్టర్లలో పేర్లు రాసి అవినీతికి పాల్పడేవారు. దీని నివారణకు కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 2023 జనవరి 1న పైలట్ ప్రాజెక్టు కింద ఎన్ఎంఎంఎస్ యాప్ తొలుత కొన్ని రాష్ట్రా లలో అమలు చేసింది. అనంతరం ఈ యాప్ తో దేశ వ్యాప్తంగా ప్రతి జాబ్ కార్డుదారుడికి ఈకేవైసీ చేసి ఆధార్ కార్డు అనుసందానించారు. తద్వారా అవినీతికి అడ్డకట్ట పడుతుందని అధికారులు పేర్కొన్నారు. కానీ మనోళ్ళు ప్రభుత్వ టెక్నాలజీ మించి పోయారు. తద్వారా పని ప్రదేశానికి వెళ్లకుండా తమకు అనుకూలమైన వారి వీడియోలను తమ దగ్గర పెట్టుకోని కళ్ళు పడే విధంగా హాజరు వేసి ఇతర ప్రాంతాల్లో ఉండే వారికి హాజరు వేసి ఉపాధి సొమ్మును బొక్కేస్తున్నారు.

**జరగాల్సింది ఇలా**

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు యాప్లో కూలీలు పనిచేసే ప్రదేశాన్ని ముందుగా జియోట్యాగ్ చేయాలి. ఒక పని ప్రారంభించే సమయంలో ముందుగా ఉపాధి కూలి ఫొటో తీయాలి. ఇం టికి వెళ్లే సమయంలో మళ్లీ ఫోటో తీయాలి. ఆ ఫొటోలను జియోట్యాగ్ తో అనుసంధానించి ఎన్ఎంఎంఎస్ యాప్ సర్వర్లో అప్లోడ్ చేయాలి. జరుగుతోంది ఇలా...! సాంకేతిక ఎంత ఆధునికతను అందిపుచ్చుకున్నటికీ మనోళ్ల తెలివితేటల ముందు చిన్నబోతోంది. ప్రస్తుతం యాప్లో కొన్ని పనులకు, ప్రత్యేకంగా కాలువ పనులకు అర కిలోమీటరు దూరంలో ఉన్నప్పటికీ యాప్లో జియోట్యాగ్ తీసుకొంటోంది. దీంతో పాటు కొంతమంది తమ మొబైల్లో పేస్ జీపీ ఎస్ లను సైతం ఇన్స్టాల్ చేసుకొని పని ప్రదేశంలోని లేకపోయినా జీపీఎస్ తీసుకొనే వెలుసుబాటు కల్పిస్తున్నారు. ఇక్కడ తద్వారా తమ బినా మీలకు ఇళ్ల వద్దనే ఉంటూ మస్టర్ వేస్తున్నా రు. వారు ఎలాంటి పనులు చేయకపోయినా అక్కడ అసలు పనే జరగక పోయినా ఆన్లైన్ లో పనిజరగుతున్నట్లు చూపడం, బిల్లులు చే సుకోవడం పరిపాటిగా మారింది. దీనికి కొంత మంది సిబ్బంది పూర్తి సహకారం అందిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇప్పటికైనా యాప్లో లోటు పాట్లను సరిచేసి అవినీతిని ఆరికట్టాలని పలు వురు ఉపాధి కూలీలు కోరుతున్నారు.

**ఆగని వంద వసూళ్లు దందా**

ఏ ప్రభుత్వం వచ్చినా ఎవరు పని చేయించినా .. ఎవరొచ్చినా కూలోళ్ళకు వరిగేదేమీ లేదని కూలీలు వాపోతున్నారు. మనోళ్లు వంద దందా వసూళ్లు మాత్రం ఆపడం లేదు. ప్రభుత్వానికి, చెడ్డపేరు తెచ్చే పనులు చేయొద్దని ఉన్నతాధికారులు చెబుతున్నప్పటికీ కింది స్థాయిలో మాత్రం ఏం మారడం లేదు. మేము కూడా బతకాలి కదా అనే దోరణి లో అందినకాడికి దండుకుంటూ కూలోళ్ళ కడుపు కొడుతున్నారు. ఇదంతా కూడా కింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అధికారులకు తెలిసే జరుగుతుందని చెప్పుకుంటున్నారు. ఎవరికి రావాల్సన వాటా వారికి నెల నెల మామూళ్ళ రూపంలో ఇంటికి చేరుతుంది. అందుచేతనే అధికారులు అంతా పై పైనే అన్నట్టు తూతూమంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**200 వసూలు చేస్తున్నారు**

నాపేరు బైరబోయిన రత్నం యాదవ్. మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం లో అవినీతి ఎక్కువైపోయింది. ఇంతకు ముందు వారానికి ఒక్కొక్కరికి దగ్గర 100 రూపాయలు వసూలు చేసేవాళ్ళు . కానీ ఇప్పుడు మళ్ళీ మళ్ళీ అవకాశం వస్తుందో రాదో అని ఏకంగా 200 దండుకుంటున్నారు. ఉపాధి హామీ పథకం గురించి చెప్పుకోవడానికే సిగ్గు గా ఉంది. అధికారులకు కూడా వాటాలు ఇవ్వాలని వసూలు చేస్తున్నారు. డబ్బులు ఇచ్చిన వారికే డబ్బులు ఎక్కువ పడతాయని చెప్పి వసూలు చేస్తున్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# ఎమ్మార్పీకి మించి వసూళ్లు


**-ఎమ్మార్పీ కంటే ఎక్కువగా సిగరెట్ ధరలు -ధూమపాన ప్రియుల జేబుకు గండి**

**-నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులు -అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..?**



**కందుకూరు పెన్ పవర్, మే 11**

కందుకూరు పట్టణంలోని అన్ని దుకాణాల్లో ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరలకు సిగరెట్లు విక్రయిస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. సిగరెట్ ప్యాకెట్లపై ముద్రించిన గరిష్ట చిల్లర ధర కంటే రూ.10 పైనే అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల బడ్జెట్లో సిగరెట్ల ధరలు పెంచారు. ధూమపాన ప్రియులు ఆ సంఘటన మరొక ముందే కందుకూరు పట్టణంలో రిటైల్ వ్యాపారస్తులు భారీగా నిల్వ ఉంచి ఎంఆర్పి కంటే భారీగా ధరలు పెంచారు. పట్టణంలో కరూర్ వైశ్యా బ్యాంక్ పక్కన ఐటిసి కంపెనీ డీలర్ అధిక మొత్తంలో సిగరెట్లు నిల్వ ఉంచి ఎంఆర్పి ధరల కంటే అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. దీంతో దుకాణాల దారులు కూడా సిగరెట్ ధరలు అమాంతం పెంచి అమ్ముతున్నారు. అదేమని ధూమపాన ప్రియులు అడిగితే మాకే ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువగా అమ్ముతున్నారని మేం పెంచాం అంటున్నారు. ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు విక్రయించడం చట్టవిరుద్ధమైనప్పటికీ, పలువురు వ్యాపారులు ఈ నిబంధనలను బేఖాతరు చేస్తున్నారు. వినియోగదారులు అడిగితే కంపెనీ రేట్లు పెరిగాయి,రవాణా ఖర్చులు ఎక్కువయ్యాయి, చిల్లర సమస్య ఉంది వంటి కారణాలు చూపుతూ అదనపు ధర వసూలు చేస్తున్నారని తెలుస్తోంది. ఎమ్మార్పీ అంటే గరిష్ట చిల్లర ధర దీని కంటే అధికంగా వసూలు చేయడం వినియోగదారుల హక్కులకు విరుద్ధం. వినియోగదారుల పరిరక్షణ చట్టం ప్రకారం ఇది శిక్షార్హమైన చర్య. అయినప్పటికీ సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో కొందరు వ్యాపారులు వినియోగదారులను దోచుకుంటున్నారు. ఈ విషయంపై పలువురు వినియోగదారులు ఫిర్యాదు చేయడానికి కూడా ముందుకు ఎవరో రాకపోవడంతో వ్యాపారులు దీన్ని అలవాటుగా మార్చుకుంటున్నారు. ఒక సిగరెట్పై రూ.2--5 అదనంగా తీసుకున్నా, రోజుకు వందలాది విక్రయాల ద్వారా భారీగా అక్రమ లాభాలు పొందుతున్నారని వినియోగదారుల సంఘాలు ఆరోపిస్తున్నాయి. వినియోగదారులు ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధర వసూలు చేస్తే వెంటనే బిల్లు తీసుకుని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు.




తూనికలు, కొలతల శాఖ, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి ఎక్కువైనా అది చట్టవిరుద్ధమే. వినియోగదారుల హక్కులను కాపాడేందుకు అధికారులు తక్షణమే స్పందించాలి అని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# శరవేగంగా అభివృద్ధి పనులు

**-ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు**





**కందుకూరు పెన్ పవర్, మే11**

పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు సరవే గంగా జరుగుతున్నాయని స్థానిక శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జరుగుతున్న, మెయిన్ రోడ్డు విస్తరణ పనులను ఇంటూరి నాగేశ్వరరావు సోమ వారం మధ్యాహ్నం పరిశీలించారు. 90 లక్షల రూపా యల నుడా నిధులతో శ్రీ అంకమ్మ తల్లి ఆలయం దగ్గర నుంచి, రూరల్ పోలీస్ స్టేషన్ వరకు సీసీ రోడ్డును వెడల్పు చేసే పనులు శరవేగంగా జరుగు తున్నాయి.ఈ ప్రాంతంలో సీసీ రోడ్డు వెడల్పు 30 అడుగులు ఉండగా... ప్రస్తుతం మరో 20 అడుగులకు పైగా వెడల్పు పెంచు తున్నారు. ఈ పనులను ఎమ్మెల్యే గారు అధికారులు, స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న డ్రైనేజీ కాలువలకు అవసరమైన చోట్ల రిపేర్లు చేసి, పైన స్లాబ్ వేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అధికారులకు సూచించారు. ఆర్టీసీ డిపో లోపలికి వెళ్లే మార్గంలో, బస్సుల రాకపోకలకు అనుకూలంగా ఉండేలా, సీసీ రోడ్డును మరో 10 అడుగులు విస్తరించాలని అధికారులకు ఆదేశాలిచ్చారు.

**తరువాత క్రమంలో...** రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి, కోవూరు రోడ్డులో టంగుటూరి ప్రకాశం పంతులు విగ్రహం వరకు రోడ్డును విస్తరించబోతున్నట్లు ఎమ్మెల్యే తెలియజేశారు.అలాగే, ప్రయాణికుల సౌకర్యార్థం పట్టణంలో బాలుర హైస్కూల్, కోటారెడ్డి హాస్పిటల్ జంక్షన్, పామూరు బస్టాండ్ వద్ద ఒక్కొక్కటి సుమారు 2.5 లక్షలతో అధునాతన బస్సు షెల్టర్లు నిర్మించబోతు న్నామని నాగేశ్వరరావు చెప్పారు. ఎన్నోఏళ్లుగా కందుకూరు పట్టణ ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులు త్వరలోనే పూర్తిగా తొలగిపోతాయని, ఒక్కొక్క ప్రాంతాన్ని అభివృద్ధి చేసుకుంటూ వస్తున్నామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. మున్సిపల్ కమిషనర్ కే అనూష, డిఈ గణపతి, డి ఆర్ టి సి డిపో మేనేజర్ శ్రీనివాస్, పట్టణ టిడిపి మాజీ అధ్యక్షులు పిడికిటి వెంకటేశ్వర్లు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, పలువురు పార్టీ నాయకులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

**జిల్లా కలెక్టర్ పి రాజాబాబు**

**కలెక్టరేట్ పెన్ పవర్, ఒంగోలు మే 11**

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచే యాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు, అన్ని శాఖల అధికా రులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజాబాబు, జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యు అధికారి చిన ఓబులేసు, ఎస్డిసిలు శ్రీధర్ రెడ్డి, మాధురి, విజయజ్యోతి, డిపిఓ వెంకటేశ్వర రావు లతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ద తీసుకోవడం జరుగుచున్నదని, ఇటీవల జరిగిన కలెక్టర్స్ కాన్ఫెరెన్స్ లో కూడా ముఖ్యమంత్రి ఈ విషయాన్ని స్పష్టం చేయడం జరిగిందన్నారు. ప్రజల నుండి వివిధ సమస్యలపై వచ్చే ప్రతి అర్జీని సంబంధిత శాఖలు అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరం పరిష్కరించడంతో పాటు అర్జీదారులు సంతృప్తి చెందేలా అర్జీల పరిష్కారం ఉండాలన్నారు. ఏదైనా కారణంగా ఫిర్యాదు పరిష్కారం సాధ్యం కాకపోతే, దానికి గల కారణాలను అర్జీదారునికి అర్థమయ్యే విధంగా ఎండార్స్‌మెంటు ఇవ్వాలని సూచించారు. ప్రజా సమస్యలు పరిష్కారంలో ఎటువంటి నిర్లక్ష్యం చూపకూడదన్నారు. సమస్యపై తీసుకున్న చర్యలతో అర్జీదారుడు సంతృప్తి చెందాలని, అర్జీ మరలా రీ ఓపెన్ అయ్యే పరిస్థితి ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేసారు. ఈ రోజు నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం 254 వినతులు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



# జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించండి

**అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం**

**మార్కాపురం పెన్ పవర్ మే11**

నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ను అభివృద్ధి పథంలో నడపడానికి శాఖల వారీగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు. జిల్లాలో ప్రజా సమస్యలపై సంతృప్తికరంగా పనిచేయాలని సూచించారు. త్రాగునీరు, పారిశుధ్య కార్యక్రమాలు పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు శాతం పెంచాలని అధికారులు ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన మరమ్మత్తులను చేపట్టాలని చెప్పారు. సంక్షేమ పాఠశాలలు, హాస్టల్స్ ను పాఠశాలల ప్రారంభం నాటికి సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. జిల్లాను హార్టికల్చర్ హాఫ్ గా తయారు చేయడానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యవసాయ, ఉద్యాన పంటలను ప్రోత్సహించాలని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, రైతులకు అవసరమైన ఎరువులు విత్తనాలు సీజన్ నాటికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక నెలలో నాలుగు శుక్రవారాల పాటు వారాలు పాటు జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో పిజిఆర్ఎస్ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, హౌసింగ్ పీడీ మోహన్ రావు, మున్సిపల్ కమిషనర్ నారాయణరావు, ఐసిడిఎస్ ఇన్చార్జి పీడీ పద్మావతి, మైక్రో ఇరిగేషన్ పీడీ జెన్నెమ్మ, జిల్లా రవాణా శాఖ అధికారి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.





# మహిళలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలి

## బ్యాంక్ మేనేజర్ ఎన్ గురువారెడ్డి

**అర్ధవీడు, పెన్ పవర్, మే 11**

మహిళలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఎన్ గురువారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని పాపినేనిపల్లె గ్రామంలో డిఆర్ డిఎ వెలుగు, పిఎంఈజిపి ద్వారా విఓఎ నిర్మలకు మంజూరైన విస్తరాకుల మిషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పారిశ్రామిక రంగంలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడాలని సూచించారు. కేవలం పొదుపుతోనే ఆగిపోకుండా వ్యాపారాలపై దృష్టి పెట్టాలని అన్నారు. చిన్న చిన్న పరిశ్రమలు స్థాపించి ఆదాయం పెంచుకోవచ్చని వివరించారు. డ్వాక్రా సంఘాల ద్వారా అనేక అవకాశాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలను వినియోగించుకోవాలని సూచించారు. బ్యాంకులు మహిళలకు ప్రత్యేక ప్రోత్సాహక పథకాలు అందిస్తున్నాయని చెప్పారు. పాల ఉత్పత్తులు, కుట్టు కేంద్రాలు, ఆహార పదార్థాల తయారీ వంటి రంగాల్లో అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. మహిళలు ధైర్యంగా ముందడుగు వేయాలని కోరారు. సమష్టిగా పని చేస్తే విజయాలు సులభంగా సాధ్యమవుతాయని అన్నారు. ఆర్థిక స్వావలంబనతో కుటుంబ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. మహిళల అభివృద్ధి సమాజ



అభివృద్ధికి దోహదం చేస్తుందని చెప్పారు. డ్వాక్రా సంఘాలు గ్రామీణ మహిళలకు మంచి వేదికగా నిలుస్తున్నాయని అభిప్రాయపడ్డారు. మహిళలు నైపుణ్యాభివృద్ధి శిక్షణలను పొందాలని సూచించారు. వ్యాపార నిర్వహణలో క్రమశిక్షణ అవసరమని వివరించారు. పొదుపు, ప్రణాళిక, కృషి ఉంటే విజయాలు సాధ్యమని అన్నారు. మహిళలు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సిసి శారద



మాట్లాడుతూ మహిళలు వ్యాపారాలపై ఆసక్తి పెంచుకోవాలని కోరారు. బ్యాంకు సహకారం ఉంటే మరింత అభివృద్ధి సాధించవచ్చు అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని పారిశ్రామికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో పాపినేని పల్లె వివోఎ రంగాచారి, అచ్చంపేట వివోఏ శ్రీదేవి భర్త శ్రీనివాసులు , అర్ధవీడు విఓఎలు కె లక్ష్మీదేవి, షేక్ రేష్మ, ఎం లక్ష్మీదేవి, నాగ భూషనమ్మ, అంకభూపాలెం విఓఎ మహాలక్ష్మమ్మ, బ్యాంకు సిబ్బంది వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధి గణపతి విగ్రహం ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే ముత్తుముల





**గిద్దలూరు పెన్ పవర్ మే 11**

రాచర్ల మండలం గుడిమెట్ట పంచాయతీ రామాపురం గ్రామంలో శ్రీ సిద్ధి భీమేశ్వరస్వామి ఆలయ ఆవరణ లో వెలసిన శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవస్థానములో శ్రీ సిద్ధి గణపతి విగ్రహం ప్రతిష్ట మహోత్సవం ఏర్పాటు వైభవంగా చేశారు .ఈకార్యక్రమం లో గిద్దలూరు. ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అర్చక స్వాములు స్వామివారి తీర్థ ప్రసాదాలు సమర్పించారు . ఈ సందర్బంగా గ్రామస్తులు ఎమ్మెల్యే ను శాలువా , పూల మాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పాటుగా రాచర్ల మండలం నాయకులు , గ్రామస్తులు , తదితరులు విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని స్వామివారికి మ్రొక్కులు చెల్లించారు.

## టిడిపి తీర్థం పుచ్చుకున్న 10 కుటుంబాలు

### -సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే ఇంటూరి



**కందుకూరు పెన్ పవర్, మే 11**

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి, సోమవారం ఉలవపాడు మండలం, కరేడు పంచాయితీ, కొత్తపల్లిపాలెం గ్రామానికి చెందిన 10 వైసిపి కుటుంబాల వారు, నాగేశ్వరరావు పై నమ్మకంతో, ఆయనతో కలిసి ప్రయాణించాలన్న దృఢ నిశ్చయంతో స్వచ్ఛందంగాటిడిపి కార్యాలయానికి వచ్చారు. మత్స్యకార కుటుంబాలకు చెందిన పొన్నాడి శ్రీను, ఏడుకొండలు, బలరాం, నాగరాజు, వెంకటేశ్వర్లు, వంశీ, సుధాకర్, శ్రీను, బాలాజీ, రామ్ చరణ్ తదితరులు ఎమ్మెల్యే సమక్షంలో పసుపు కండువాలు కప్పుకొని, తెలుగుదేశం పార్టీలో చేరారు.

## వేసవి విజ్ఞాన తరగతులకు విశేష ఆదరణ

### విద్యార్థిని విద్యార్థులకు ఫ్రీడమ్ ఫైటర్ గురించి అవగాహన

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 11**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన తరగతులకు హాజరైన విద్యార్థినీ విద్యార్థులకు సోమవారం రిటైర్డ్ ఉద్యోగి పి రంగస్వామి మజ్జిగ ప్యాకెట్లు, స్వీట్స్ పంపిణీ చేసి తన సేవాభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కర్ రావు మాట్లాడుతూ సెల్ ఫోన్ అవసరమైన మేరకే వినియోగించాలని, సెల్ ఫోన్ చూడడం వల్ల కలిగే లాభ నష్టాలు గురించి వివరించారు వేసవి విజ్ఞాన తరగతులకు 18 మంది విద్యార్థులు హాజరై స్పోకెన్ ఇంగ్లీష్, లెక్కలు బోధించడం జరిగిందని అలాగే కథలు చదివించి చెప్పించి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు ఆళ్ల భాస్కర్ రావు, రిటైర్డ్ ఉద్యోగి పి రంగస్వామి, బోధన సిబ్బంది సి హెచ్ భారతి, ఈర్ల అనిత, చిట్టే లక్ష్మి, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



## పెద్ద గోగులపల్లిలో నేడు సుబ్బయ్య స్వామి ఆరాధన మహోత్సవం -ప్రత్యేక పూజలు, హోమాలు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 11**

మండలంలోని పెద్ద గోగులపల్లి గ్రామంలో వెలసిన పునుగోటి సుబ్బయ్య స్వామి వారి ఆరాధన మహోత్సవ వేడుకలను నేడు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహకులు ఆరికట్ల వెంకటసుబ్బయ్య చారి, ఆకుమళ్ల సుబ్రహ్మణ్య చారి, ఆకుమళ్ల సుధాకరాచారి, ఆకుమళ్ల శివకుమార్ ఆచారి, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, స్వామివారి భక్తబృందం తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా సనాతన శంకర పీఠం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు నెమ్మికంటి నరసయ్య సిద్ధాంతి మరియు శైలజ పాల్గొంటున్నారని తెలిపారు విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి శిష్య పరంపరలో కలియుగంలో అవతార పురుషునిగా దర్శనమిచ్చిన పునుగోటి సుబ్బయ్య స్వామి వారు అనేక ఆధ్యాత్మిక శక్తులను కలిగిన మహనీయులని, వేదమంత్రాలు, తంత్రాలు, యంత్రాలలో అపారమైన సాధన చేసి ఈశ్వరి దేవి కటాక్షంతో అనేక మంది శిష్యులకు జ్ఞానబోధన చేసిన మహాత్ముడిగా స్వామివారికి ప్రత్యేక స్థానం ఉందన్నారు. వైశాఖ బహుళ దశమి రోజున స్వామివారు సజీవ సమాధి పొందిన సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే ఆరాధన మహోత్సవాలకు పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారని తెలిపారు.మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, మహా పుణ్యాహవాచనం, అఖండ ప్రజ్వలన, ఆదిత్యాది నవగ్రహ ఆవాహన, అష్టభైరవుల ఆవాహన, మండపారాధన, ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తుల శాంతి, సౌభాగ్యాల కోసం లక్ష్మీ గణపతి హోమం, నవగ్రహ హోమం, మహాలక్ష్మి హోమం, రుద్ర హోమం, ఈశ్వరి దేవి హోమాలను విశేషంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 5 గంటలకు ఈశ్వరి దేవి అమ్మవారి కళశోత్సవము , రాత్రి 7 గంటలకు స్వామివారి తీర్థప్రసాదాల పంపిణీతోపాటు భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేసినట్లు తెలిపారు అనంతరం రాత్రి 8 గంటలకు ఈశ్వరి దేవి అమ్మవారి గ్రామోత్సవాన్ని మేళాతాళాలతో ఘనంగా నిర్వహించనున్నట్లు వెల్లడించారు 13న ఉదయం మహాగణపతి పూజ, స్వామివారి రుద్రాభిషేకం, పూర్ణహుతి, మహా నైవేద్యం, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు కార్యక్రమాలను తిలకించేందుకు పరిసర గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించి మహోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## తిరుమల కొండపై 108 రోజుల పాటు నిరంతరాయంగా దీపారాధన

### భక్తుల సేవాభావం అభినందనీయం -స్వామివారి సేవకుడు పత్తి రామమూర్తి



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 11**

తిరుమలనాథ స్వామి ఆలయంలో 108 రోజులపాటు ఆవు నెయ్యి దీపరాధన పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తుల సేవా భావం అభినందనీయమని స్వామివారి సేవకుడు పత్తి రామమూర్తి అన్నారు మండలంలోని అయ్యలూరివారిపల్లి పంచాయతీ పరిధిలోని తిరుమల కొండపై వెలసిన శ్రీదేవి భూదేవి సమేత తిరుమలనాథ స్వామి ఆలయం లో నిర్వహించిన 108 రోజుల ఆవు నెయ్యి దీపరాధన పవిత్ర కార్యక్రమం ముగిసింది ఈ సందర్భంగా స్వామి వారి సేవకుడు పత్తి రామమూర్తి మాట్లాడుతూ తులాబందుల చలమయ్య సూచనలతో భక్తుల సహకారంతో మాఘమాసం రథసప్తమి రోజున ప్రారంభించిన ఈ పవిత్ర దీపరాధన కార్యక్రమం హనుమాన్ జయంతి రోజున పూర్తికావడం విశేషమన్నారు. 108 రోజుల పాటు నిరంతరాయంగా ఆవు నెయ్యితో స్వామివారికి దీపారాధన నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమైన కార్యక్రమమని తెలిపారు.ఈ దీపరాధనలో పరిసర గ్రామాల భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారని పేర్కొన్నారు. భక్తుల ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించే విధంగా ఈ కార్యక్రమం కొనసాగిందన్నారు. కార్యక్రమం విజయవంతానికి సహకరించిన తులబందుల చలమయ్య నాయుడుకి మరియు భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## రామకృష్ణను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే దివి శివరాం

**వలేటివారిపాలెం, పెన్ పవర్ మే 11**

వలేటివారిపాలెం మండలం శాఖవరం గ్రామం తెలుగుదేశం పార్టీ నాయకులు వడ్లమూడి రామకృష్ణ ఇటీవల మోకాలుకు సికింద్రాబాద్ లోని షైన్ హాస్పిటల్ నందు శస్త్రచికిత్స చేయించుకుని ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్నాడు . విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దివ్య శివరాం సోమవారం శాఖవరం గ్రామంలోని రామకృష్ణ నివాసానికి చేరుకొని పరామర్శించారు. సందర్భంగా రామకృష్ణకు మోకాలుకు జరిగిన శస్త్రచికిత్స ఎలా జరిగింది ఎంత ఖర్చు అయింది అనే విషయాన్ని శివరాం తెలుసుకున్నారు. డాక్టర్ ఇచ్చిన సలహా మేరకు తగు జాగ్రత్తలు తీసుకొని మందులు వాడుకోవాలని , త్వరగా కోలుకోవాలని శివరాం ఆకాంక్షించారు. శివరాం వెంట ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు శిక్షణ శిబిరం మాజీ కోఆర్డినేటర్ కాకర్ల మల్లికార్జున రావు , కందుకూరు నియోజకవర్గం తెలుగురైతు కమిటీ మీడియా కోఆర్డినేటర్ దివి శ్రీధర్ బాబు , వలేటివారిపాలెం మండలం తెలుగు రైతు అధ్యక్షులు తాటికొండ




రమణయ్య , శివారెడ్డి , వడ్లమూడి పాండురంగారావు , వడ్లమూడి శ్రీహరిరావు , కోరాకుల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

## వెండిదండి రామిరెడ్డికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ మే 11**

గిద్దలూరు నియోజకవర్గం బేస్తవరిపేట మండలం శింగరిపల్లి గ్రామంలో ఉండే వెండిదండి జయచంద్ర భాను రెడ్డి తండ్రి అయిన వెండిదండి రామిరెడ్డి మరణించిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి నేడు ఆ గ్రామం వెళ్లి దశదినఖర్మ లో పాల్గొన్నారు. వారి చిత్ర పటానికి పూలతో ఘనంగా నివాళులు అర్పించారు అనంతరం కలెక్టర్ తో వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ ఇంటి పెద్ద ను కోల్పోవడం దురదృష్టంకరం అని ధైర్యంగా ఉండాలని ఓదార్చారు కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటుగా బేస్తవారిపేట మండలం ప్రముఖులు, గ్రామస్తులు , స్థానిక నాయకులు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

## హనుమాన్ జయంతి శుభాకాంక్షలు

**వలేటివారిపాలెం, పెన్ పవర్ మే 11**



వలేటివారిపాలెం మండల ప్రజలకు నెల్లూరు జిల్లా వైసీపీ పార్టీ రైతు వింగ్ వైస్ ప్రెసిడెంట్ కట్టా హనుమంత రావు హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. హనుమాన్ జయంతి సందర్భంగా భక్తులందరూ విరివిగా పాల్గొని స్వామివారి తీర్థ ప్రసాదారాలు స్వీకరించాలని ఆయన కోరారు. ఆంజనేయస్వామి దయతో మండల ప్రజలందరూ సుఖ సంతోషాలతో ,సిరి సంప దలతో సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

## ఆత్మ రక్షణ, క్రమశిక్షణ, ఏకాగ్రత కోసం కరాటే



**గిద్దలూరు పెన్ పవర్ మే 11**

గిద్దలూరు లోని శ్రీ రాజ రాజేశ్వరి బిఈడి కాలేజీ లో కరాటే మాస్టర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లో విద్యార్దిని, విద్యార్దులు కరాటే విద్యను అభ్యసిస్తునారు. కరాటే మాస్టర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కరాటే నేర్చుకోవడంవల్ల విద్యార్థులు లలో క్రమశిక్షణ, ఆత్మరక్షణ, ఏకాగ్రత మంచి ఆరోగ్యం ఇంకా అనేక లాబాలు వున్నాయి అని చెప్పారు. బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ నేర్పిస్తున్నట్టు తెలియజేశారు..ఈ వేసవి సెలవులలో కరాటే తో పాటు కర్రసాము కూడా నేర్పిస్తున్నట్టు చెప్పారు... ఆసక్తి కలిగినా వారు ఈ వేసవి లో వుపయోగించు కోగలరు అని తెలియజేశారు.

# నారాయణస్వామి దేవస్థానంలో ఘనంగా ధ్యాన మందిరం శంకుస్థాపన

## పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత -కార్యక్రమాలలో పాల్గొన్న టిడిపి నాయకులు





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 11**

పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని మండల టిడిపి నాయకులు అన్నారు మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం అభివృద్ధిలో భాగంగా ధ్యాన మందిరం నిర్మాణం అలాగే పామూరు సి ఎస్ పురం నేషనల్ హైవే పై దేవస్థానానికి వెళ్లే ప్రధాన రహదారి ప్రవేశ ద్వారం వద్ద నిర్మించనున్న మెయిన్ ఆర్చి శంకుస్థాపన కార్యక్రమాన్ని సోమవారం ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారాయణ సమక్షంలో వేద పండితులు మంకాల శివప్రసాద్ శర్మ మంత్రోచ్ఛరణల నడుమ భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.దేవస్థానంలో ధ్యాన మందిర నిర్మాణం కోసం కనిగిరి శాసనసభ్యులు, ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సిజిఎఫ్ నిధుల ద్వారా రూ. 1.25 కోట్లు మంజూరు చేయించడం అభినందనీయమని నాయకులు కొనియాడారు. ఎమ్మెల్యే చొరవతో దేవస్థానం అభివృద్ధి పనులు వేగవంతమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ జిల్లాలో ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రంగా పేరుగాంచిన ఈ దేవస్థానానికి ప్రతి ఆదివారం రాష్ట్రంలోని అనేక ప్రాంతాల నుంచి భక్తులు వస్తారని తెలిపారు భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం ధ్యాన మందిరం నిర్మించుటకు మంజూరు చేసిందని అలాగే ఆర్చి నిర్మాణానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు గ్రామస్తులు మాట్లాడుతూ నారాయణస్వామి దేవస్థానానికి నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించిన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కి ప్రత్యేక అభినందనలు తెలిపారు ఈ కార్యక్రమాలలో మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి సభ్యులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, సింగిల్ విండో అధ్యక్షులు చెరుకుపల్లి వెంకటరెడ్డి, భైరవకోన ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, జిల్లా గొర్రెల పెంపకం దారుల సహకార యూనియన్ డైరెక్టర్ కోనంగి వెంకటకొండయ్య, మాజీ మండల ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, టిడిపి సీనియర్ నాయకులు నాగిశెట్టి చిన్న మాలకొండయ్య, అట్లూరి రామకృష్ణంరాజు,చావా సుబ్బయ్య, గ్రామ టిడిపి అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి, పట్టణ టిడిపి అధ్యక్షులు బత్తుల వెంకటాద్రి, నారాయణస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాధవ ప్రసాద్, నీటి సంఘం అధ్యక్షులు డి మోహన్ రెడ్డి, నారాయణస్వామి దేవస్థానం మాజీ కమిటీ సభ్యులు పాలపర్తి నారాయణరావు, మండల బీసీ సెల్ ఉపాధ్యక్షులు చందలూరి బాల కాశయ్య, కొమ్మినేని వెంకట్రావు, బయసాని మధుసూదన్, వల్లపు శెట్టి వెంకటనారాయణ, షేక్ కాజా, కె ప్రసాద్, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# జీవశాస్త్రంలో కృత్రిమ మేధస్సు

## జక్కం రేణుకా రెడ్డి



**పొదిలి, పెన్ పవర్, మే 11**

జీవశాస్త్రంలో కృత్రిమ మేధస్సు పాత్ర గురించి జక్కం రేణుక రెడ్డి వివరించారు. స్థానిక ఎస్. వి. ఐ. టి కోచింగ్ సెంటర్ లో సోమవారం నాడు పదవ తరగతి విద్యార్థులకు బయాలజీ క్లాస్ లో కృత్రిమ మేధస్సు పాత్ర గురించి విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ అడ్వాన్స్ పదవ తరగతి ప్రోగ్రాం ఎంతో ఉపయోగకరంగా ఉందని, ఇటువంటి నూతన విద్యా కార్యక్రమాలు అందించడం వల్ల విద్యార్థులకు ఎంతగానో మేలు జరుగుతుందని ఆనందాన్ని వ్యక్తపరిచారు. తమ కోచింగ్ సెంటర్ లో కమ్యూనికేషన్ స్కిల్ తో పాటు పదవ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే పలు అంశాలపై సెమినార్ నిర్వహించడం జరుగుతుందని కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జక్కం రేణు కా రెడ్డి చెప్పారు.

# గొట్టిపాటి లక్ష్మీని కలసిన తెలుగుదేశం నాయకులు



**పొదిలి, పెన్ పవర్, మే 11**

దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్ చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ని మండల తెలుగుదేశం నాయకులు కలుసుకున్నారు. సోమవారం నాడు లక్ష్మి పుట్టినరోజు సందర్భంగా ఆమెను దేశం నాయకులు మర్యాదపూర్వకంగా కలుసుకొని, శుభాకాంక్షలు తెలియజేశారు. గొట్టిపాటి లక్ష్మీని కలసిన వారిలో మర్రిపూడి ఎం పి పి వాకా వెంకటరెడ్డి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి మీగడ ఓబుల్ రెడ్డి, తెలుగుదేశం మైనార్టీ విభాగపు నాయకులు షేక్ మౌలాలి, ముల్లా రబ్బాని, ముల్లా గౌస్ భాష తదితరులు ఉన్నారు.

# త్రాగునీటి సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం వద్దు

## - జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 11**

ప్రజలకు త్రాగునీటి సరఫరా, నాణ్యత విషయంలో ఎలాంటి లోపాలు, నిర్లక్ష్యం ఉండకూడదని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్పష్టం చేశారు. జిల్లాలో కుళాయిల ద్వారా త్రాగునీటి సరఫరా తీరుపై సోమవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆయన ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. మోటార్ల నిర్వహణ, నీటి ట్యాంకులను శుభ్రం చేస్తున్న తీరు, క్లోరినేషన్, పైప్ లైన్ వాల్వు, పరిసరాల పరిశుభ్రతపై కలెక్టర్ సమీక్షించారు. క్లోరినేషన్, ట్యాంకుల క్లీనింగ్ లకు జిల్లావ్యాప్తంగా ఉమ్మడిగా ఒక తేదీని నిర్ణయించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన ఆదేశించారు. అన్ని గ్రామాల్లో ప్రభుత్వం కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీటినే ప్రజలు తాగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ దిశగా నీటి వనరుల నిర్వహణ, పరిశుభ్రతపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న నీటిలో ఉండే ఖనిజాల విలువలను కూడా ప్రజలకు తెలియజేయాలని చెప్పారు. జిల్లా అధికార యంత్రాంగం చేపట్టిన జల సురక్ష కార్యక్రమ ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు కంటే తక్కువ ఎత్తులో ఉండే పైప్ లైన్ వాల్వును ఎక్కువ ఎత్తులో ఉండేలా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఓవర్ హెడ్ ట్యాంక్ నుంచి పైపుల ద్వారా సరఫరా అవుతున్న నీటి పరిమాణాన్ని, క్లోరినేషన్ విధానాన్ని నిరంతరం పరిశీలించేందుకు అవసరమైన ఆధునిక పరికరాలను కూడా సమకూర్చుకోవాలని కలెక్టర్ చెప్పారు. ఈ విషయాల్లో కాంట్రాక్టు ఏజెన్సీలు ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. త్రాగునీటికి సంబంధించి 'పల్లెనిద్ర' కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన సమస్యలను ప్రభుత్వం విడుదల చేసిన అత్యవసర నిధుల నుంచి తక్షణమే పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఈ సమస్యలను పరిష్కరించడంతో పాటు వేసవిలో త్రాగునీటికి ఎలాంటి ఎద్దడి లేకుండా సురక్షిత నీటి సరఫరా లక్ష్యంగా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో త్రాగునీటి వనరులు కలుషితం కాకుండా చూడాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపైనా ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. నాగేశ్వరరావు, జడ్పీ సీఈవో చిరంజీవి, డిపిఓ వెంకటేశ్వరరావు, పబ్లిక్ హెల్త్ ఈ.ఈ. శ్రీనివాస సంజయ్ పాల్గొన్నారు.



# అధికారులు స్పందించరూ...



**వలేటివారిపాలెం, పెన్ పవర్ మే 11**

మండలంలోని శామీర్ పాలెం గ్రామంలో రామాలయం వద్ద మురుగు నీరు రోడ్డుపై గలగలా గోదారి వలే పారుతుంది . సైడ్ కాలువలు చెత్తాచెదారం తో పేరుకు పోవడంతో మురుగు నీరు ముందుకు వెళ్ళడం లేదు. కాలువలో నుంచి మురుగు నీరు రోడ్డు మీదకు చేరి కంపుకొడుతుంది. సచివాలయం సిబ్బంది నిత్యం ఈ రోడ్డుపైనే తిరుగుతున్నారని , సమస్య కళ్ళముందే కనబడుతున్న పట్టించుకోవడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు మీద నీరు నిలిచి పాచి పట్టింది. ద్విచక్ర వాహనదారులు జారి కింద పడుతున్నారు. సమస్యను అధికారులు దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడంలేదని అంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి మురుగు నీరు తొలగించి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# దొనకొండకు సాగర్ నీరు కరువాయే





**దొనకొండ మే 11 పెన్ పవర్ :**

మండలం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దొనకొండ మండల సిపిఎం కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన సాగర్ నీరు మంచినీరు రావడంలేదని దొనకొండ మండల తహసిల్దార్ బి. రమాదేవి మరియు డిప్యూటీ ఎంపీడీవో ఏవో దావూద్ కి అర్జీ ఇవ్వడం జరిగింది. మేజర్ పంచాయతీలోని ఒబ్బపురం అరబస్తాన్ శివాజీ నగర్ బేతల పురం గ్రామాలకు గత నాలుగు నెలలలో ఒకరోజు మాత్రమే మంచినీరు సాగర్ నీరు వచ్చాయన్నారు. ప్రజలు నాలుగు నెలల నుండి మంచినీటి కోసం ఇబ్బంది పడుతున్నారు. తహసిల్దార్ అర్జీ ఇవ్వగా ఆర్డబ్ల్యూఎస్ ఏఈ తో ఫోన్ మాట్లాడటం జరిగింది. పది రోజుల్లో మంచి నీళ్లు ఇవ్వకపోతే ఈ ప్రాంతాలను ప్రజలను సమీకరించి ఆందోళన చేస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో దొనకొండ మండల వ్యవసాయ కార్మిక అధ్యక్షులు కుందుర్తి చిన్న నరసింహులు కురవాటి రామయ్య కోలా కిరణకుమార్ సయ్యద్ యూనిస్ బాబావలి నజీర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టడమే జలధార- జలహారతి లక్ష్యం

## నల్లమడుగులలో పనులు ప్రారంభించిన ఎంపీడీవో ప్రతాపరెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 11**

మండలంలోని నల్లమడుగుల గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన జలధార-జలహారతి పనులను సోమవారం ఎంపీడీవో వి. ప్రతాపరెడ్డి ప్రారంభించి భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూగర్భ జలాల పెంపు, నీటి వనరుల సంరక్షణ, ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టడమే జలధార-జలహారతి కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.చెరువుల పునరుద్ధరణ, కాలువల శుభ్రపరిచే పనులు, వర్షపు నీటిని నిల్వ చేసే చర్యల ద్వారా భూగర్భ జలాలు పెరిగి ప్రజలకు మేలు జరుగుతుందని ఉన్నారు ప్రభుత్వం ఆదేశాల మేరకు జలధార-జలహారతి పనులను పక్కాగా నిర్వహించి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని అధికారులకు సూచించారు.ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ఉపాధి కూలీలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు గ్రామ ప్రజలు కూడా నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, గ్రామస్తులు, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు సత్వరసేవలు అందించాలి -ఎమ్మెల్యే ఇంటూరి



**వలేటివారిపాలెం, మే 11 పెన్ పవర్**

స్థానిక వలేటివారిపాలెం తహసీల్దార్ కార్యాలయాన్ని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రీవెన్స్ లో వచ్చిన అర్జీలు, వాటిలో ఎన్ని పరిష్కరించారు, పెండింగ్ లో ఎన్ని ఉన్నాయి అనే అంశాలపై దృష్టి పెట్టారు. అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని తహసిల్దార్ మధుసూదన్ రావును ఆదేశించారు. కొంతమంది వీఆర్వోలు విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నట్లు, అర్జీదారులను పదేపదే తిప్పుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటివారు వెంటనే తమ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. రెవిన్యూ సమస్యల పట్ల, బాధ్యతగా వ్యవహరించి పనిచేయాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు సూచించారు.

# పోలీసు మీకోసంలో 74 ఫిర్యాదులు

**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 11**

ప్రజా ఫిర్యాదులను తక్షణ పరిష్కారం అందించాలనే లక్ష్యంగా ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పీ పి.శ్రీధర్, పోలీస్ అధికారులు సోమవారం ఒంగోలు, జిల్లా పోలీస్ కార్యాలయంలో మీకోసం(పిజి ఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ సమస్యలకు సంబంధించిన వ్రాతపూర్వక అర్జీలను పోలీస్ అధికారులకు సమర్పించారు. వారు తమ సమస్యలను వివరంగా తెలియజేశారు. పోలీస్ అధికారులు ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సివిల్, భూ, ఆర్థిక తగాదాలు, చీటింగ్, అత్తారింటి వేధింపులు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో కందుకూరు సీఐ షేక్ అన్వర్ భాషా, సింగరాయకొండ సీఐ శ్రీహరి,అద్దంకి అర్బన్ సీఐ సుబ్బరాజు,ప్యానెల్ అడ్వొకేట్ బి.బాలాజీ సింగ్, సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్దన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.



# విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలోనే చేరాలి

## ప్రధానోపాధ్యాయులు బి డేవిడ్



**చింతపూడి, పెన్ పవర్, మే 11**

మండలంలోని చింతపూడి నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. డేవిడ్ ఆధ్వర్యంలో సోమవారం 'బడి పిలుస్తుంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ బృందం కె అగ్రహారం, రామాపురం, కంభంపాడు తదితర గ్రామాల్లో పర్యటించి ప్రైవేటు పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో చేరాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు ప్రతి విద్యార్థికి తల్లికి వందనం పథకం ద్వారా 15 వేల రూపాయలు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, డిజిటల్ విద్య వంటి పలు సౌకర్యాలు అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో మెరుగైన బోధన జరుగుతోందని తెలిపారు.ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి మంచి భవిష్యత్తు సాధించాలంటే ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె నాగరాజు, బి చిన్ననారాయణ, షేక్ నాయబ్ రసూల్, జె వెంకట్రావు, పార్థసారథి, ఇ చాంద్ భాష తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనే లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు




**క్రైమ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 11**

ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు, జిల్లా వ్యాప్తంగా గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం ఒంగోలులోని పివిఆర్ గ్రౌండ్‌లో గంజాయి వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. టాస్క్ ఫోర్స్ సీఐ భీమా నాయక్ పర్యవేక్షణలో, ఏఎస్ఐ మహబూబ్ బాషా, ఈగల్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది యువకులకు, క్రీడాకారులకు, ప్రజలకు గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందితో పాటు పలువురు స్థానికులు పాల్గొన్నారు.

# వివేక డిగ్రీ కళాశాలలో త్వరలో ఎసిసిఏ కోర్సు ప్రారంభం



**కందుకూరు పెన్ పవర్, మే 11**

ఇంటర్మీడియట్ అనంతరం విద్యార్థులు అధికంగా బీటెక్ కోర్సులు, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ వైపు మొగ్గుచూపుతున్న నేపథ్యంలో నిరుద్యోగ సమస్య పెరుగుతున్నది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, బీటెక్‌కు ప్రత్యామ్నాయంగా అంతర్జాతీయ స్థాయి గుర్తింపు కలిగిన ఎ సి సి ఎ (అసోసియేషన్ ఆఫ్ చార్టెడ్ సర్టిఫైడ్ అకౌంటెంట్స్) ప్రొఫెషనల్ కోర్సును బీకాంతో కలిపి శ్రీ వివేక డిగ్రీ కాలేజీలో ప్రారంభించనున్నట్లు శాక్యముని ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ చైర్మన్ నేతి మహేశ్వరరావు వెల్లడించారు. సోమవారం శ్రీ వివేక డిగ్రీ కళాశాలలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వరావు మాట్లాడుతూ మన ప్రాంతంలో ప్రతి గ్రామంలో ఛార్టర్డ్ అకౌంటెంట్ లు ఉన్న పరిస్థితులలో ఎ సి సి ఏ కోర్సును ప్రారంభించామని తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేయకుండా కేవలం మూస విధానంలో అనుసరించి బీటెక్, ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో చేరడం వల్ల చాలామంది రాణించలేకపోతున్నారని ఆయన పేర్కొన్నారు. రాబోయే కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావంతో ఉద్యోగ రంగంలో మార్పులు సంభవించే అవకాశాలు ఉన్న నేపథ్యంలో, అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ఎసిసిఏ లాంటి అంతర్జాతీయ కోర్సులపై దృష్టి పెట్టడం అవసరమని సూచించారు. ఇంటర్మీడియట్ అనంతరం తీసుకునే నిర్ణయమే విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని పేర్కొంటూ, తల్లిదండ్రులకు కూడా ఈ కోర్సు పై అవగాహన కల్పించే కార్యక్రమాలను త్వరలో నిర్వహించనున్నామని తెలిపారు.కందుకూరు ప్రాంతంలో అంతర్జాతీయ స్థాయి కోర్సును ప్రవేశపెట్టడానికి బిఆర్ ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల క్రమశిక్షణ ప్రధాన కారణమని పేర్కొంటూ, ఈ ప్రయత్నానికి సహకరించిన ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల చైర్మన్ ఉన్నం భాస్కరరావు కి, కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు కి, డైరెక్టర్స్ జి బాల భాస్కరరావు, బి నరేంద్ర బాబు, ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు కి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా వివేక డిగ్రీ కాలేజ్ కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఇంటర్మీడియట్ అనంతరం పెద్ద సంఖ్యలో విద్యార్థులు బీటెక్ కోర్సుల్లో చేరుతున్నప్పటికీ, అందులో సుమారు 80 శాతం మంది ఉపాధి అవకాశాలు పొందలేక నిరుద్యోగులుగా మారుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో అంతర్జాతీయ గుర్తింపు కలిగిన వంటి కోర్సులు విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా అవకాశాలు కల్పిస్తాయని చెప్పారు. కందుకూరు ప్రాంతంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఈ కోర్సుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల యాజమాన్య సిబ్బంది తో పాటు శ్రీ వివేక డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ అబ్బూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# ప్రతి వర్షం నీటి బొట్టును ఒడిసి పట్టాలి

## - జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు

**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, ఒంగోలు మే 11**

ప్రతి వర్షం నీటి బొట్టును ఒడిసి పట్టి, భూగర్భ జలాన్ని పెంచడమే లక్ష్యంతో ప్రజల భాగస్వామ్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన జలధార -- జలహరతి -- సాగునీటి సంఘాల భాద్యత కార్యక్రమాన్ని జిల్లా లో ప్రతిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, జలవనరులు, డ్వామా, గ్రౌండ్ వాటర్ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై జిల్లాలో చేపడుతున్న జలధార -- జలహరతి -- సాగునీటి సంఘాల భాద్యత కార్యక్రమం పురోగతిపై క్షుణ్ణంగా సమీక్షించి దిశానిర్దేశం చేసారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో జలధార -- జలహరతి -- సాగునీటి సంఘాల భాద్యత కార్యక్రమాన్ని జిల్లాలో పెద్ద ఎత్తున చేపడుతున్నందున ప్రజలు, రైతులు, స్వచ్ఛంద సంస్థలు, సాగు నీటి సంఘాల సభ్యులు స్వచ్ఛందంగా పాల్గొని నీటి సంరక్షణ కార్యక్రమాల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడికక్కడ వర్షపు నీటిని ఒడిసి పట్టి, భూగర్భ జలాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యమన్నారు. వంద రోజుల ప్రణాళికతో జలధార కార్యక్రమం కింద ప్రజల భాగస్వామ్యంతో ఉపాధిహామీ పథకాన్ని అనుసంధానం చేసి అన్ని గ్రామాల్లో నీటి నిల్వకు అవకాశం ఉన్న పనులను చేపట్టేలా ప్రణాళికలు రూపొందించడం జరిగింది. వంద రోజుల కార్యాచరణతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జులై 14వ తేదీ వరకు జలధార పనులు కొనసాగనున్నాయి. ఈ వంద రోజుల కార్యాచరణ తో జిల్లా లో చెరువుల పునరుద్ధరణ ప్రణాలికలు, నీటి సంరక్షణ నిర్మాణాలకు శ్రీకారం, ఫీడర్ కెనాల్స్, చెరువు పూడికతీత



పనులతో చెరువుల నీటి నిల్వ సామర్థ్యం రెట్టింపు చేయడం, చెరువుల గట్లను బలోపేతం చేయడం, జంగిల్ క్లియరెన్స్ చేయడం, తూములు, అలుగుల మరమ్మతులతో పాత సాగునీటి వ్యవస్థకు కొత్త జీవం పోయడం, గ్రామాల్లో రైతు సంఘాల పర్యవేక్షణలోనే పనులు జరుగుతుండటంతో పారదర్శకతకు పెద్దపీట వేయడం జరుగుతుందన్నారు. ఈ జల ధార కార్యక్రమాన్ని మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో (ఎంజిఎన్ఆర్ ఈజిఎస్) అనుసంధానం చేయడం వల్ల ఉపాధితో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సాగు నీటి సామర్థ్యం పెరిగి రైతు ప్రయోజనాలు రెట్టింపు ప్రయోజనం కలుగుతోంది. చెరువులు, ఫీడర్ కెనాల్స్ పూడిక తీతకు సంబంధించి తమ స్థానిక అవసరాలకు సంబంధిత పూడికతీత



మట్టిని వినియోగించుకోవచ్చునని, అయితే సంబంధిత ఇరిగేషన్, పంచాయితీరాజ్ శాఖ అధికారులనుండి ముందస్తు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ వారం జిల్లా లోని ప్రతి మండలంలో ఒక చెరువును పునరద్దరించే కార్యక్రమాన్ని చేపట్టి , ఈ కార్యక్రమంలో అన్నీ వర్గాల ప్రజలను భాగస్వాములు చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో జలధార – జలహరతి – – సాగునీటి సంఘాల భాద్యత కార్యక్రమాన్ని ఒక యజ్ఞం లాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్.ఈ వరలక్ష్మి, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, గ్రౌండ్ ,వాటర్ డిడి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

# హనుమాన్ శోభాయాత్ర



**గిద్దలూరు పెన్ పవర్ మే 11**

గిద్దలూరు పట్టణంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం హనుమాన్ శోభయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈశోభాయాత్ర ను గిద్దలూరు శాసనసభ భ్యులు



ముత్తుముల అశోక్ రెడ్డి పూజాకార్యక్రమలు నిర్వహించి ప్రారంభించారు. అశోక్ రెడ్డికి కార్య నిర్వాహకులు అపూర్వస్వాగతం పలికారు. అయన కూడా శోభాయాత్రలో పాల్గొన్నారు. ఈసందర్బంగా పట్టణం కాషాయ మయమైనది. పెద్దఎత్తున మహిళలు , పాల్గొని కాషాయ జెండాలు ధరించి జై హనుమాన్ జై జై హనుమాన్ అంటూ నినాదాలు చేశారు . నినాదాలతో పట్టం వీధులు మార్మోగాయి. కాకుండా వెయ్యి మంది మాహిళలు కోలాటం నిర్వహించారు. చివర్లో హనుమాన్ విగ్రహాన్ని అలంకరించిన రథం పై ఉంచి నగరోత్సవం నిర్వహించారు. కాకుండా మహిళలు కలశాల ఎత్తుకున్నారు. గతమునెన్నడు జరగని రీతిలో ఈశోభాయాత్రను నిర్వహించారు. ఈయాత్ర పురాతన పుణ్యక్షేత్రం శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణం నుండి ప్రారంభమై పురవీధుల గుండా సాగింది. గిద్దలూరు నియోజకవర్గ దేవాలయాల కమిటీ ఆద్వయంలో నిర్వహించటం విశేషం. శోభయాత్రకు మునుపే దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటికి హనుమంతుని చిత్రం గల కాషాయ జెండాలను పట్టణంలో పంచారు. దీంతో పట్టణంలో ప్రతి ఇంటిపై కాశాయ జెండా రెప రెప లాడుతున్నాయి. ఈ శోభాయాత్ర నిర్వహణలో పొలంరెడ్డి బాలకృష్ణా రెడ్డి , చేరెడ్డి ఎర్రా రెడ్డి , తదితర దాతల అవిరళ కృషి ఎంతో ఉంది. అనంతరం రేడియో భావి సెంటర్ లోని అభయాంజనేయస్వామి ఆలయప్రాంగణంలో అల్పాహారం వితరణ చేశారు.

# వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలి

## ఫుడ్ ఇన్స్పెక్టర్ వాడా మనోహర్ రెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 11**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం– పామూరు రోడ్డులో గల ఐఓసి పెట్రోల్ బంక్ ను సోమవారం ఫుడ్ ఇన్స్పెక్టర్ వాడా మనోహర్ రెడ్డి మరియు రెవెన్యూ ఇనిస్పెక్టర్ సురేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెట్రోల్ బంక్ పరిసరాలను పరిశీలించి పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు, ఇంధన నిల్వలను తనిఖీ చేశారు.అలాగే వాహనదారులు, కస్టమర్లను అడిగి పెట్రోల్, డీజిల్ నాణ్యత, సరఫరా విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. స్టాక్ రికార్డులు, నిల్వ వివరాలు, సరఫరా విధానాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఫుడ్ ఇన్స్పెక్టర్ వాడా మనోహర్ రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను పాటిస్తూ పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఐఓసీ పెట్రోల్ బంక్ అధినేత పోకల మాలకొండయ్య, ఆర్ ఐ సురేష్, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పధంతో ముందుకు సాగాలి



**పొన్నలూరు పెన్ పవర్ మే 11**

స్థానిక అంగనవాడి కేంద్రంలో సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వాన ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి తనలోని ప్రతిభను గుర్తించుకోవడం ఎంతో ముఖ్యమని తెలిపారు. మన బలాలు,బలహీనతలు తెలుసుకొని సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు, ఎస్సై సత్యనారాయణ, అంగన్వాడి కార్యకర్తలు మధురవాణి, గౌస్య, రాధ ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

# యరజర్లలో టిడిపి నాయకుడి బరితెగింపు

-భూ బకాసురుడిగా అవతారం

-మా పొలం మాకు కావాలి

-ప్రాణ భయం ఉందన్న నల్లూరి ధనలక్ష్మి

-జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారికి వినతి





**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం మే 11**

ఒంగోలు మండలంలోని యరజర్లలో టిడిపి నాయకుడి భూదాహం నుంచి కాపాడాలని నల్లూరి ధనలక్ష్మి జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూఒంగోలు మండలం, యరజర్ల గ్రామం, సర్వే నంబర్ 42-9లో 44 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. మేము ఆ భూమిని మా పూర్వీకుల ఆస్తిగా సాగు చేస్తున్నాము, ఆ సర్వే నంబర్లోని భూమిపై రుణాలు కూడా తీసుకున్నాము. మా కుమారుడు నల్లూరి బ్రహ్మయ్య హైదరాబాద్లోని ఒక సాఫ్ట్వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. నా కుటుంబం మా గ్రామం యరజర్లలో నివసిస్తోంది.మా భూమి పక్కనే ఉన్న సర్వే నంబర్ 42-7లో 38 సెంట్ల భూమిని 2022లో కొనుగోలు చేసిన గుండపనేని నారాయణమ్మ ఆమె భర్త గుండపనేని శ్రీనివాసులు, ఒంగోలు టీడీపీ మండల అధ్యక్షుడు అనే రైతు దంపతులు దీనిని ఆక్రమించారు. మేము వారు కొనుగోలు చేసిన 42-7, 42-10 భూముల మధ్య ఉన్నాము. తన భూమిని ఒకే ప్లాటుగా చేయడానికి మా భూమిని అమ్మమని అతను మమ్మల్ని అడిగాడు, కానీ మాకు వ్యవసాయానికి కేవలం 2 ఎకరాల భూమి మాత్రమే ఉన్నందున మేము అమ్మడానికి నిరాకరించాము. మా భర్త వృద్ధులు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు, నేను అంధురాలుని వస్తువులను స్పష్టంగా గుర్తించలేను అనే ఆవేదన వ్యక్తం చేశారు. మేము మా భూమిని అమ్మడానికి నిరాకరించడంతో, అతను మా భూమిలో కౌలు సాగు కోసం అడిగి, సరిహద్దులను ధ్వంసం చేసి, రెండు మూడు సంవత్సరాల పాటు కౌలు కోసం దానిని సాగు చేసేవాడు. గత సంవత్సరం, కౌలు సరిపోకపోవడంతో మేము మా భూమిని సాగు చేయాలనుకున్నప్పుడు, అతను భూమిని ఖాళీ చేయకపోవడమే కాకుండా, మా కుటుంబాన్ని అంతం చేస్తానని బెదిరించారు. ఇప్పటికి కూడా మమ్మల్ని కొట్టి మా మీదనే రాజకీయ ప్రభావంతో కేసులు పెట్టిస్తా అని బెదిరిస్తున్నాడు. అతను నాకు పింఛను ఆపేస్తానని మమ్మల్ని బెదిరించాడు అని తెలిపారు. మేము ప్రకాశం కలెక్టరేటు అనేక ఫిర్యాదులు చేశాము. మంత్రి లోకేష్ బాబు కి కూడా ఫిర్యాదు చేశాము అని తెలిపారు. సర్వే నంబర్ 42-9లోని మా భూమిలో గుండపనేని శ్రీనివాసులు అక్రమంగా ఆక్రమించుకున్నారని, భూమి హద్దులు గుర్తించాలని లోకేష్ అన్న బృంద సభ్యుడు జ్ఞానేంద్ర ప్రసాద్ గారు, కలెక్టర్ రాజా బాబు ని అభ్యర్థించారు. గుండపనేని శ్రీనివాసులు స్థానిక ఎమ్మెల్యే పేరుతో రాజకీయ పలుకుబడితో తహసిల్దార్ ను ఎటువంటి చర్య తీసుకోకుండానే పరిమితం చేశాడు అని అన్నారు. అతను టిడిపి మండల అధ్యక్షుడిగా ఉంటూ, స్థానిక టిడిపి ఎమ్మెల్యే పేరు చెప్పి–గంజాయి అక్రమ రవాణా ఎస్సీ ఎస్టీల పై అకృత్యాలకు సంబంధించినవి వంటి చట్టవిరుద్ధమైన కేసులు మాపై నమోదు చేయిస్తానని తరచుగా మమ్మల్ని బెదిరిస్తున్నాడు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారుల స్పందించి మాకు న్యాయం చేయాలని వారు కోరారు.

## ఉపాధి హామీ పథకంలో ముఖ హాజరు తొలగించాలి

✸ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర.



**డుంబ్రిగుడ,పెన్ పవర్,మే 11**: డుంబ్రిగుడ మండలం కండ్రూం పంచాయతీ జంకర వలస గ్రామంలో ఆంధ్రరాష్ట్ర గిరిజన సంఘం కార్యదర్శి సురేంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో పనిచేస్తున్న ఉపాధి కూలీల సమస్యలు అడిగి తెలుసుకొన్నారు. కూలీలకు ముఖ హాజరు పడక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారనీ చాలామంది ఉపాధి శ్రామికులు తాము ఉపాధి పని చేసేటప్పుడు తమ ముఖ హాజరు పడక కూలి డబ్బులు అందక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారనీ. కొన్ని చోట్ల సిగ్నల్ లేని చోట ముఖ హాజరు పడక ఉపాధి కూలీలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారాని తక్షణమే ముఖ హాజరు రద్దు చేయాలని ఆయన డిమాండ చేశారు.

ఉపాధి హామీ పథకం పై పూర్తిగా ఆధారపడి జీవిస్తున్నా కుటుంబలు పూర్తిస్థాయిలో జీవించడానికి ఈ ఇచ్చే కూలీ సరిపోవటం లేదని తెలియజేశారు.

రోజు కూలి కనీసం 600 రూపాయలు కూలిగా ఇస్తే వేరే పనులు చేయకుండా ఈ ఉపాధి హామీ పని చేసుకోవచ్చని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని రోజుకూలి 600 రూపాయలు చెల్లించాలని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం దుంబ్రిగుడ మండల కార్యదర్శి టి.సూర్యనారాయణ. కండ్రూం పంచాయతీ నాయకుడు కె.రామచందర్ తదితరులు పాల్గొన్నారు

## ఈ నెల 13న టెక్కలిలో జిల్లా స్థాయి రగ్బీ పోటీ ఎంపికలు



**టెక్కలి, పెన్ పవర్ మే 11** : శ్రీకాకుళం జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు అండర్ 18 జూనియర్స్ బాయ్స్ అండ్ గర్ల్స్ ఎంపికలు నిర్వహిస్తున్నట్లు శ్రీకాకుళం జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డొాశికన రామకృష్ణ, పొన్నాడ పారతీశం లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఈనెల 13న ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం జిల్లా జట్లు ఎంపికలు జరుగుతాయన్నారు. 2008 సంవత్సరం తర్వాత క్రీడాకారులు జన్మించి ఉండాలన్నారు. ఇందుకోసం ఆధార్ కార్డు డేట్ అఫ్ బర్త్ సర్టిఫికేట్ తీసుకొని ఎంపికకు హాజరు కావాలనే అన్నారు. ఈ జట్టులో ఎంపికైన క్రీడాకారులు పల్నాడు జిల్లా నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ఈ నెల 24, 25 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ రగ్బీ ఛాంపియన్షిప్ 2026 పోటీల్లో పాల్గొంటారని అన్నారు. మరిన్ని వివరాలకు శ్రీకాకుళం జిల్లా రగ్బీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాడాన నారాయణరావు ఫోన్ నెంబర్ 8500007272 కి సంప్రదించాలని కోరారు.

## రైతులు " ఉర్వి యాప్" ను అనుసరించాలి.




**టెక్కలి, పెన్ పవర్ మే 11** : "ఉర్వి యాప్" ను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని వాటిలో మీ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అడిషనల్ డి.పి.ఎం ధనుంజయ సూచించారు. కోటబొమ్మాళి మండల కేంద్రం లోని మండల మహిళా సమాఖ్య వద్ద సోమవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాల మహిళా సంఘాలకు "ఉర్వి యాప్" లో రైతుల వివరాలను ఏవిదంగా నమోదుచేయాలో వివరించారు. ఈ సందర్భంగా అడిషనల్ డి.పి.ఎం ధనుంజయ మాట్లాడుతూ మే నెలలో రైతాంగం పి. ఎం. డి. ఎస్ వేసుకోవాలని అన్నారు. రైతుల పొలాల్లో పి.ఎం.డి.ఎస్ విత్తనాలు జల్లే విదంగా సిబ్బంది ప్లాన్ చేసుకోవాలని సూచించారు. మండలంలో ఉన్న రైతులందరూ పచ్చిరొట్ట పైరుగా నవధాన్యాలు ఎకరానికి 15 కేజీలు వేసుకుంటే ప్రధాన పంటలో కలుపు ను సమర్థవంతంగా నివారించుకోవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో అడషనల్ డి.పి.ఎం, సి. డి. ఎఫ్ మల్లేష్, మోడల్ మేకర్ పి.సింహాచలం, రెండు మండలాల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

# నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ. 2,19,864/- లు

**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 11**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.2,19,864/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా రూ. 1,15,760/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.29,960/- లు, శాశ్వత అన్నదానం నకు విరాళంల ద్వారా రూ,39,596/- లు , స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ .16,548/- లు, స్వామివారికి శ్రీపాద కానుకల వలన 18 వేల రూపాయలు వచ్చినట్లు తెలిపారు.

# కైలాసగిరి త్రిశూల్ వద్ద ఘనంగా 'సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్' కార్యక్రమం

**విశాఖ, దక్షిణం, పెన్ పవర్ మే 11** :కైలాసగిరి కొండపై ఇటీవల నిర్మించిన త్రిశూల్ వద్ద సోమనాథ్ స్వాభిమాన్ పర్వ్ కార్యక్రమాన్ని సోమవారం విశాఖ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరుశురామ్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పీవీఎన్ మాధ వ్ మాట్లాడుతూ, సోమనాథ్ ఆలయ పునర్ని ర్మాణానికి 75 సంవత్సరాలు పూర్తవుతున్న వేళ కైలాసగిరిలో త్రిశూల్ ఏర్పాటు కావడం విశేష మని పేర్కొన్నారు. దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ చేతుల మీదుగా సోమనాథ్ ఆలయం ప్రారంభమైందని, అప్పటి కేంద్ర హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ నాయకత్వంలో ఆలయ పునర్నిర్మాణం జరిగిందని గుర్తుచేశారు.

చారిత్రక దాడుల కారణంగా కోల్పోయిన సోమ నాథ్ ఆలయ వైభవం పునర్నిర్మాణంతో తిరిగి వెలుగులోకి వచ్చిందని ఆయన అన్నారు. ప్రధా నమంత్రి నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణం గా దేశవ్యాప్తంగా జ్యోతిర్లింగాల అభివృద్ధికి చ ర్యలు చేపడుతున్నామని తెలిపారు. మోదీ పిలుపు మేరకు 'స్వాభిమాన్ పర్వ్'తో పాటు 'స్వాభిమాన్ జాగరణ' కార్యక్రమాలను నిర్వ హిస్తున్నామని చెప్పారు.కైలాసగిరిపై త్రిశూల్ నిర్మాణం చేపట్టిన వీఎంఆర్డీఏను ఆయన అభి నందించారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా కైలాసగిరి ఆధ్యాత్మిక కేంద్రంగా మరింత గుర్తింపు పొం దుతుందని అభిప్రాయపడ్డారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.దేశంలో వివక్షత లేకుండా కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని, తెలంగాణలో కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం "ట్రిపుల్ ఇంజిన్ సర్కార్" కొనసాగు తోందని వ్యాఖ్యానించారు.తమిళనాడు నూ తన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన జోసఫ్ విజయ్‌కు శు భాకాంక్షలు తెలియజేసిన ఆయన, మోదీ--అమిత్ షా నాయకత్వంలో దేశంలో తీవ్రవాద నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి నాగేంద్ర, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కేశవ కాంత్, రాష్ట్ర కార్యదర్శి యు. సుజాత, స్టేట్ బిల్డింగ్ కమిటీ సభ్యుడు బొత్స సురేష్, మీడియా ప్యానలిస్ట్ కే. నర్సింగరావు, పార్వతీపురం జిల్లా ఇన్‌చార్జ్ ప్రకాష్ రెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఇన్‌చార్జ్ విజయానంద రెడ్డి, జిల్లా మీడియా కన్వీనర్ కోటేశ్వరరావు, సోషల్ మీడియా కన్వీనర్ రాకేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్ర, జిల్లా పదాధికారులు, మండల అధ్యక్షులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.




## కోటబొమ్మాళి లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



**టెక్కలి, పెన్ పవర్ మే 11** : కోటబొమ్మాళి మండల పరిధి లోని గ్రామాల్లో ముమ్మరంగా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం ప్రారంభించారు. ఇందులో భాగంగా సోమవారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక తలసముద్రం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కోటబొమ్మాళి మండలం లోని సొడాం, ఆనందపురం, ఉసిరికజోల గ్రామాల్లో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారాన్ని ఇంటింటా నిర్వహించారు. శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తన కాల జ్ఞనం లో తాడిపత్రి లోని ప్రబోధాశ్రమము ఉన్నత మైన జ్ఞనం కలిగిందని చెప్పారు. మహాదేవతలు అందరూ అట్టి ఆనందాశ్రమం లో ఆనందగురువు వద్ద నే ఉన్నారని చెప్పారు. ప్రబోధాశ్రమం నుండి వెలువడిన త్రైత సిద్ధాంతము గొప్పది అని పరోక్షంగా చెప్పారు..

త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం ను తెలియజేస్తుంది., ప్రతి ఒక్కరూ కర్మ యోగం విశిష్టత, త్రైత సిద్ధాంత జ్ఞానం తెలుసుకోవాలి అనే ముఖ్య ఉద్దేశంతో భగవద్గీత ప్రచారం చేస్తున్నామని , మన శరీరంలో దేవుడు మూడు ఆత్మలు గా విభజింపబడి ఉన్నాడని - జీవాత్మ, ఆత్మ, పరమాత్మ ల గురించి తెలుసుకోవడమే త్రైత సిద్ధాంతం అని తెలిపారు, భగవద్గీత లో కర్మయోగం, బ్రహ్మయోగం, భక్తియోగం అనేవి దైవ ధర్మాలు అని వాటి ప్రకారం నడుచుకుంటే కర్మ నుండి బయట పడేసి మనిషికి ముక్తిని ఇస్తాయి అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో త్రైతసిద్ధాంతం-ప్రబోధ సేవాసమితి ఇందూ జ్ఞాన వేదిక - తలసముద్రం కమిటీ అధ్యక్షుడు , సభ్యులు శ్రీనివాస్ ,సింహాచలం, రాజారావు, ధన్వంతరి, రమేష్, దినేష్, మాణిక్యం, సాయి, మౌనిక, రమణ లు పాల్గొన్నారు.

# పొగాకు బేళ్ళకు మద్దతు ధర ఇవ్వాల్సిందే

## - మాజీ ఎమ్మెల్యే దివి శివరాం



**కందుకూరు పెన్ పవర్, మే 11**

పట్టణంలోని పామూరు రోడ్ లో గల టుబాకో బోర్డు నెంబర్ 27 నందు పొగాకు బెళ్ళు కొనుగోలు జరుగుతున్న తీరును రైతు నాయకులతో కలిసి కందుకూరు మాజీ శాసనసభ్యులు డాక్టర్ దివి శివరాం సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పొగాకు కొనుగోలు చేస్తున్న కంపెనీ ప్రతినిధులను ఉద్దేశించి శివరాం మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర ఇవ్వాలని లేనిపక్షంలో రైతులతో కలిసి పొగాకు బోర్డును బాయ్ కట్ చేయడానికి వెనుకాడబోమని హెచ్చరించారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం పొగాకు కంపెనీలు సిండికేట్ అయి రైతులను దగా చేస్తున్నారని శివరాం ఆరోపించారు. త్వరలో రైతు నాయకులతో కలిసి పొగాకు కంపెనీల యాజమాన్యంతో సమావేశం అవుతామని , అప్పటికి రైతులకు న్యాయం జరగకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి రైతుల సమస్యను తీసుకెళ్లి పరిష్కారం అయ్యేంతవరకు రైతులకు అండగా ఉంటామని రైతులు ఎవ్వరూ అధైర్యపడవద్దని శివరాం రైతులకు భరోసా ఇచ్చారు. శివరాం వెంట రైతు నాయకులు తానికొండ రమణయ్య , శివారెడ్డి , ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ మాజీ అధికార ప్రతినిధి గోచిపాతల మోషే , తెలుగుదేశం పార్టీ కార్యకర్తల శిక్షణ శిబిరం మాజీ కో ఆర్డినేటర్ కాకర్ల మల్లికార్జున రావు , కందుకూరు నియోజకవర్గం తెలుగురైతు కమిటీ మీడియా కో ఆర్డినేటర్ దివి శ్రీధర్ బాబు తదితరులు ఉన్నారు.

## డిజిటలైజేషన్‌తోవైఎస్సార్సీపీకి పూర్వ వైభవం తీసుకురావాలి

**మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్**



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మే 11**:వైఎస్సార్సీపీ క్యాడర్ రిజిస్ట్రేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియలో భాగంగా ప్రతి కార్యకర్త ఓటీపీ ధృవీ కరణ ప్రక్రియను పూర్తి చేయాలని దక్షిణ ని యోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. సోమవారం ఆసీలమెట్ట కార్యాలయంలో నిర్వహించిన దక్షిణ నియో జకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.

పార్టీ బలోపేతానికి డిజిటలైజేషన్ కీలకమని, పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు గుర్తింపు, సముచిత స్థానం కల్పించాలనే ఉద్దే శంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే పార్టీ ఐడీ కార్డులు పొందిన అనేక మం ది కార్యకర్తలకు సంస్థాగత పదవులు లభించా యని పేర్కొన్నారు.వైఎస్సార్సీపీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసి పూర్వ వైభవం తీసు కురావడం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత అని అన్నారు. ప్రజల మద్దతుతో వచ్చే ఎన్ని కల్లో వైఎస్సార్సీపీ తిరిగి అధికారంలోకి వస్తుం దని ధీమా వ్యక్తం చేశారు.అలాగే రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన వాసుపల్లి గణేష్ కుమార్, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయ డంలో విఫలమైందని ఆరోపించారు. సూపర్ సిక్స్ పథకాలు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో ప్రజల్లో అసం తృప్తి పెరుగుతోందన్నారు. రాష్ట్ర అప్పులు పెరు గుతున్నాయని, పేదల సంక్షేమానికి చేరాల్సిన నిధులు పక్కదారి పడుతున్నాయని విమర్శిం చారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపు నిచ్చారు.

ఈ సమావేశంలో రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్ , సౌత్ పరిశీలకులు వీసం రామకృష్ణ, వార్డు అధ్యక్షులు, కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల ప్రతినిధులు మరియు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కూలీల ఆవేదన ప్రభుత్వానికి పట్టదా..?

✸ ఉపాధి హామీ కూలీల ముఖహాజరు విధానం రద్దుచేయాలి.!

✸ పూర్తిస్తాయి కమ్యూనికేషన్ అందుబాటులో వచ్చే వరకు-పాత విధానమే కొనసాగించాలి.!

✸ ఆదివాసి గిరిజన సంఘం నిరసన.



**హుకుంపేట పెన్ పవర్ మే 11**:హుకుంపేట మండల వ్యాపితంగా కమ్యూనికేషన్ పూర్తి స్థాయిలో అందుబాటు లేకపోవడంతో ,

ప్రజలు ప్రభుత్వ సేవలు పొందడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారూ అదే విషయం ప్రభుత్వం గుర్తించినప్పటికీ, ఇటీవలి కాలంలో ఉపాధి హామీ కూలీల మస్టరు నమోదు కోసం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఎన్ ఎమ్ ఎం ఎస్ నేషనల్ మొబైల్ మోనిటరింగ్ సిస్టమ్ యాప్ ను తీసుకు వచ్చారు.

వాటిద్వారా కూలీలు పనికి ముందు, పని ముగింపు తర్వాత,రెండు సార్లు ముఖ హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంది. మొదటి హాజరు నమోదు కాకపోతే పని చేయడానికి అవకాశం ఉండదు.

పని ముగింపు తర్వాత హాజరు నమోదు కాకపోతే,

చేసిన పనికి కూలి రాకుండా పోతుంది.

.కారణంగా ఉపాధి కూలీలు తీవ్ర ఆందోళనకూ గురౌతున్నారు. ముఖ హాజరు విధానంతో కూలీలకు ఉపాధి అందకుండా పోతుంది,

మరోవైపు చేసిన పనికి డబ్బులు రాకుండా పోతుంది.

కావున ఉపాధి హామీ కూలీల ముఖ హాజరు విధానంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలనీ, ఎంపిడివో కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు.

అనంతరం మండల స్పెషల్ అధికారికి సమస్యలతో కూడిన మెమొరాండం అందజేశారు.

ఈ కార్యక్రమానికి ఆదివాసి గిరిజన సంఘం మండల కమిటీ నాయకులు సోమన్న, లక్ష్మణరావు,రామారావు, అప్పాలకొండ పడల్, అప్పారావు, క్రిష్ణ రావు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే ఇంటూరి

**కందుకూరు పెన్ పవర్, మే 11**

కందుకూరు ఎమ్మెల్యే .ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ప్రకాశం భవనంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ని మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజక వర్గ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించారు. కందుకూరు సబ్ కలెక్టర్ డి.హిమవంశీ కూడా ఈ సందర్భంగా ఆయనతో పాటు ఉన్నారు.



## ఐపీఎల్‌లో PBKS తరపున ఎంట్రీ.. 18 ఏళ్ల తర్వాత పంజాబ్ VS రాజస్థాన్ మ్యాచ్‌కి అంపైర్‌గా శ్రీవాస్తవ






**హైదరాబాద్ పెన్ పవర్:** లక్నోకు చెందిన మాజీ రంజీ ఆటగాడు తన్మయ్ శ్రీవాస్తవ ఐపీఎల్‌లో ఆన్-ఫీల్డ్ అంపైర్‌గా అరంగేట్రం చేయబోతున్నాడు. ఏప్రిల్ 28న ముల్లాన్‌పూర్‌లో పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌తో అతను ఈ కొత్త బాధ్యతలను చేపట్టాడు. 2008లో పంజాబ్ కింగ్స్ జట్టు తరఫున ఆటగాడిగా ఐపీఎల్‌లో అడుగుపెట్టిన శ్రీవాస్తవ, 18 సంవత్సరాల తర్వాత మళ్లీ అదే జట్టు ఆడే మ్యాచ్‌లో సరికొత్త పాత్రలో మైదానంలోకి దిగడం విశేషం.

ఐపీఎల్‌లో ఆన్-ఫీల్డ్ అంపైర్‌గా విధులు నిర్వర్తించిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన మొట్ట మొదటి అంపైర్‌గా అతను గుర్తింపు పొందాడు. గత ఏడాది అతను ఐపీఎల్‌లో ఫోర్త్ అంపైర్‌గా ఎంట్రీ ఇచ్చాడు. ఈ సీజన్‌లో ఆన్-ఫీల్డ్ అంపైర్‌గా అతనికి మొత్తం నాలుగు మ్యాచ్‌ల బాధ్యతలు అప్పగించారు. వీటితో పాటు, పలు మ్యాచ్‌లలో ఫోర్త్ అంపైర్‌గా, టీవీ అంపైర్‌గా కూడా అతను సేవలు అందించనున్నాడు.

పంజాబ్ కింగ్స్ ఐం రాజస్థాన్ రాయల్స్ (ఏప్రిల్ 28)

ఢిల్లీ క్యాపిటల్స్ ఐం చెన్నై సూపర్ కింగ్స్ (మే 5)

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఐం ముంబై ఇండియన్స్ (మే 10)

చెన్నై సూపర్ కింగ్స్ ఐం సన్‌రైజర్స్ హైదరాబాద్ (మే 18)

**క్రికెటర్‌గా ప్రయాణం:**

అండర్-19 ప్రపంచకప్ గెలిచిన భారత జట్టులో సభ్యుడైన తన్మయ్ శ్రీవాస్తవ.. తన క్రికెట్ ప్రయాణాన్ని లక్నో వీధుల్లో ప్రారంభించాడు. అతను మొదట చౌక్, కేడీ సింగ్ బాబు స్టేడియాల్లో ఆడాడు. ఆ తర్వాత గ్రీన్ పార్క్ హాస్టల్‌కు వెళ్లి, కాన్పూర్ తరపున అండర్-14 క్రికెట్ నుంచి ఫస్ట్ క్లాస్ క్రికెట్ వరకు అంచెలంచెలుగా ఎదిగాడు. టీమిండియా మాజీ అండర్-19 కెప్టెన్ అయిన శ్రీవాస్తవ, తన కెరీర్‌లో 90 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడి 4,918 పరుగులు సాధించాడు.

ఆటగాడిగా రిటైర్మెంట్ ప్రకటించిన తర్వాత శ్రీవాస్తవ ఆర్సీబీ (RCB) జట్టుకు స్కౌట్‌గా కూడా పని చేశాడు. అనంతరం కోచింగ్ వైపు వెళ్లగా, లెవల్ 2 కోచింగ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. జమ్మూ కాశ్మీర్ రంజీ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా సేవలు అందించడంతో పాటు నేషనల్ క్రికెట్ అకాడమీ లో అండర్-16 జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా కూడా పని చేశాడు. ఆ తర్వాత అంపైరింగ్ వైపు అడుగులు వేసిన అతను, గత మూడేళ్లుగా దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లలో అంపైర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

# ఐపీఎల్ ఫ్రాంచైజీ ఓనర్లకి బీసీసీఐ వార్నింగ్.. రూల్స్ బ్రేక్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్ క్లైమాక్స్‌కు వచ్చేసింది. లీగ్ స్టేజ్ దాదాపు ముగింపు దశకు చేరుకుంది. దీంతో ఐపీఎల్ ఫ్రాంచైజీ ఓనర్ల తీరుపై బీసీసీఐ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. బోర్డు జారీ చేసిన నిబంధనలను కొన్ని జట్ల యజమానులు ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించింది. ఇకపై రూల్స్ బ్రేక్ చేస్తే కఠిన చర్యలు తప్పవని తేల్చి చెప్పింది. బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఇటీవలే ఐపీఎల్ ఫ్రాంచైజీలకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు. మ్యాచ్ జరిగే సమయంలో జట్టు ఓనర్లు ప్లేయింగ్ ఏరియాలోకి రావొద్దని, ఆటగాళ్లు లేదా సపోర్ట్ స్టాఫ్‌తో ప్రత్యక్షంగా మాట్లాడొద్దని తేల్చి చెప్పారు. కానీ కొందరు ఓనర్లు ఈ నిబంధనలను పట్టించుకోవడం లేదని బీసీసీఐ చెప్పింది.

ఐపీఎల్ ఫ్రాంచైజీ యజమానులకు ఇప్పటికే వార్నింగ్




ఇచ్చాం.. డగౌట్ సమీపంలో ఓనర్లు తిరుగుతూ కనిపిస్తున్నారు.. మరికొందరు మొబైల్ ఫోన్లతో స్టేడియంలోకి వచ్చి ఫొటోలు కూడా తీస్తున్నారు.. వాటికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయి.. అనేక సార్లు హెచ్చరించినా వారి తీరులో మార్పు రావడం లేదు.. మరోసారి ఇదే సీన్ రిపీట్ అయితే కఠిన చర్యలు తీసుకుంటామని బీసీసీఐ అధికారి ఒకరు వెల్లడించారు.

ఐపీఎల్ 2026 సీజన్‌లో 'హనీ ట్రాప్' ప్రమాదాలపై కూడా బీసీసీఐ అన్ని ఫ్రాంచైజీలను అలర్ట్ చేసింది. ప్లేయర్స్ లేదా అధికారులపై లైంగిక వేధింపుల లాంటి ఆరోపణలు వచ్చే ఛాన్స్?లు ఉన్నాయని వార్నింగ్ ఇచ్చింది. హై ప్రొఫైల్ క్రీడా వాతావరణాల్లో ఇలాంటివి ఎక్కువగా ఉంటాయి, ప్రతి ఫ్రాంచైజీ అప్రమత్తంగా ఉండాలని దేవజిత్ సైకియా తెలియజేశారు. బీసీసీఐ, ఐపీఎల్ ఆపరేషన్స్ సభ్యులతో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి నజర్ పెట్టింది. ఈ బృందాలు హోటల్ గదుల్లో తనిఖీలు చేయడంతో పాటు పర్మిషన్ లేని వ్యక్తులు.. ప్లేయర్స్ గదుల్లోకి ప్రవేశించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని బీసీసీఐ హెచ్చరికలు జారీ చేసింది.

# ఐపీఎల్ నుంచి రెండు టీమ్స్ ఔట్.. మిగతా జట్ల ప్లేఆఫ్స్ లెక్కలు ఇవే!

**హైదరాబాద్ పెన్ పవర్:** IPL 2026 Playoffs: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 తుది దశకు చేరుకుంది. ఆదివారం ఒక్క రోజే రెండు టీమ్స్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమించాయి. ముంబై ఇండియన్స్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చివరి బంతికి విజయం సాధించింది. అలాగే మరో మ్యాచ్‌లో లక్నోపై చెన్నై సూపర్ కింగ్స్ 5 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ రెండు మ్యాచ్‌ల ఫలితంతో ముంబై, లక్నో సూపర్ జెయింట్స్ అధికారికంగా ప్లేఆఫ్ రేసు తప్పుకున్నాయి. మిగిలిన 8 జట్లు టాప్-4లో నిలిచి ప్లేఆఫ్ బెర్తు కోసం తీవ్రంగా శ్రమిస్తున్నాయి. ఇప్పుడు 8 జట్ల ప్లేఆఫ్స్ లెక్కలని ఒకసారి పరిశీలిద్దాం..





**రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు** : ఇప్పటి వరకు ఐపీఎల్ లో 11 మ్యాచ్ లు ఆడిన ఆర్సీబీ 14 పాయింట్లతో టాప్ ప్లేస్ లో కొనసాగుతోంది. ఇక నెట్ రన్‌రేట్ (+1.103).. మరో మ్యాచ్ గెలిస్తే 16 పాయింట్లతో ప్లే ఆఫ్స్ కి చేరుకుంటుంది. ఒకవేళ బెంగళూరు మిగతా 3 మ్యాచ్ లలో గెలిస్తే 20 పాయింట్లతో క్వాలిఫయర్-1కు నేరుగా చేరుకుంటుంది. అప్పుడు ఫైనల్ చేరడానికి రెండు ఛాన్స్ లు ఉంటాయి. **సన్ రైజర్స్ హైదరాబాద్:** సన్ రైజర్స్ జట్టు కూడా 11 మ్యాచ్లో 7 విజయాలతో 14 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. కానీ, నెట్ రన్‌రేట్ (+0.737) తక్కువగా ఉండటంతో సెకండ్ ప్లేస్ లో కొనసాగుతుంది. సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు ఇతర సమీకరణాలతో సంబంధం లేకుండా నేరుగా అర్హత సాధించాలంటే తమ చివరి 3 మ్యాచులలో రెండింటిలో గెలవాల్సిందే. మే 22వ తేదీన ఆర్సీబీతో జరిగే హైదరాబాద్ చివరి లీగ్ మ్యాచ్ క్వాలిఫయర్-1 స్థానాన్ని ఎవరు దక్కించుకుంటారో నిర్ణయిస్తుంది. **గుజరాత్ టైటాన్స్.** గుజరాత్ జట్టు 11 మ్యాచులు ఆడి 14 పాయింట్లతో 3వ స్థానంలో ఉంది. ఆర్సీబీ, సన్ రైజర్స్ జట్లతో పోలిస్తే గుజరాత్ నెట్ రన్‌రేట్ (+0.228) తక్కువగా ఉంది. టైటాన్స్ ప్లేఆఫ్స్ కి చేరాలంటే తర్వాత ఆడే 3 మ్యాచ్ లలో రెండింట్లో తప్పక గెలవాల్సిన అవసరం ఉంది. మే 12న గుజరాత్, హైదరాబాద్ మధ్య జరగబోయే మ్యాచ్ ఇరు జట్లకు కీలకం కాబోతుంది. **పంజాబ్ కింగ్స్:** ఐపీఎల్ లో 10 మ్యాచులు ఆడిన పంజాబ్ ఇప్పటికే 13 పాయింట్లు సాధించింది. చివరి నాలుగు మ్యాచులలో రెండింట్లో గెలిస్తే చాలు ఆ జట్టు 17 పాయింట్లతో సునాయాసంగా ప్లే ఆఫ్స్ బెర్తును చేరుకుంటుంది. ఢిల్లీ, ముంబై, ఆర్సీబీ, లక్నోలతో పంజాబ్ కింగ్స్ తమ తర్వాత మ్యాచులలో పోరాడాల్సిన అవసరం ఉంది. **చెన్నై సూపర్ కింగ్స్:** ప్రస్తుతం 12 పాయింట్లతో ఉన్న చెన్నై కాస్త గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటుంది. ఈ జట్టు చివరి మూడు మ్యాచ్ లలో రెండింట్లో గెలిస్తే 16 పాయింట్ల వస్తాయి. కానీ, నెట్ రన్‌రేట్ (+0.185) తక్కువగా ఉండటం సీఎస్కేకి కొంచెం ఇబ్బందికరంగా మారింది. ఎల్లో ఆర్మీ నేరుగా అర్హత సాధించాలంటే మిగతా అన్ని మ్యాచులలో తప్పక గెలవాల్సిందే. **రాజస్థాన్ రాయల్స్:** ఈ జట్టు కూడా ఇప్పటి వరకు 11 మ్యాచులలో 6 విజయాలు సాధించింది. మిగతా 3 మ్యాచ్లో కనీసం రెండింట్లో గెలిస్తే ప్లే ఆఫ్స్ అవకాశాలు సజీవంగా ఉంటాయి. గత 4 మ్యాచులలో మూడింట ఓడిపోవడంతో రాజస్థాన్ నెట్ రన్ రేట్ (+0.082) ఘోరంగా పడిపోయింది. ఈ టీమ్ నాలుగో స్థానం కోసం సీఎస్కేతో పోటీ పడే ఛాన్స్ ఉంది. **కోల్‌కతా నైట్‌రైడర్స్:** కేకేఆర్ ప్లేఆఫ్స్ చేరుకోవడానికి చాలా తక్కువ ఛాన్స్ లు ఉన్నాయి. 10 మ్యాచులు ఆడిన నైట్‌రైడర్స్ 9 పాయింట్లతో కొనసాగుతుంది. ఈ జట్టు 17 పాయింట్ల మార్కును చేరుకోవాలంటే మిగిలిన నాలుగు మ్యాచులలోనూ తప్పక గెలవాల్సిందే. ఒక్క మ్యాచ్లో ఓడినా చెన్నై, రాజస్థాన్ లాంటి ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంది. **ఢిల్లీ క్యాపిటల్స్:** 11 మ్యాచ్లో నాలుగింట్లో గెలిచిన ఢిల్లీ సాంకేతికంగా మాత్రమే ప్లేఆఫ్స్ రేసులో నిలిచింది. ఈ జట్టు 14 పాయింట్లకు చేరుకోవడానికి మిగిలిన అన్ని మ్యాచ్లలోనూ గెలిచి తీరాల్సిందే. అలాగే ఇతర జట్ల ఫలితాలు కూడా తమకు అనుకూలంగా రావాలని ఢిల్లీ ఆశించాల్సింది.



# బుట్టబొమ్మ తొలిసారి హద్దులు చెరిపేసిందా?



జిన్నీ వెడ్స్ సన్నీ 2ని ప్రమోట్ చేస్తున్నప్పుడు మేధా శంకర్ గ్రీన్ లెహంగాలో స్టన్స్ చేసింది

బుట్టబొమ్మగా ఫేమస్ అయిన పూజాహెగ్డే కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. ఒకప్పుడు వరుస విజయాలతో గోల్డెన్ లెగ్‌గా పేరు తెచ్చుకున్న ముద్దుగుమ్మకు కొంతకాలంగా అదృష్టం కలిసిరావడం లేదు. తెలుగు,తమిళ్ లో కొన్ని సినిమాలు చేతిలో ఉన్నా? అవి రిలీజ్ అయి సక్సెస్ అయ్యే వరకూ గానీ అమ్మడి కెరీర్ ఎలా ఉంటుందన్నది క్లారిటీ రాదు. ప్రస్తుతం వరుణ్ ధావన్ సరసన -హై జవాని- అనే హిందీ చిత్రంలో నటిస్తోంది. ఈ సినిమాతోనైనా బాలీవుడ్ లో మళ్లీ సక్సెస్ అందుకోవాలని ఆశపడుతోంది. ఈ నేపథ్యంలో ఈ సినిమాకు సంబంధించి ముంబై వర్గాల్లో ఓ ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది.పూజా హెగ్డే ఈ చిత్రం కోసం గ్లామర్ హద్దులను చెరిపేసి నటిపస్తుందనే వార్తలు వినిపిస్తున్నాయి. సాధారణంగా తన సినిమాల్లో గ్లామర్‌కు ప్రాధాన్యత ఇచ్చే పూజా ఈ హిందీ ప్రాజెక్ట్ కోసం మరింత బోల్డ్‌గా కనిపించబోతోందని సమాచారం. బాలీవుడ్ నెటిజన్లను , యువతను ఆకట్టుకోవడానికి ఆమె ఈ విధమైన మేకోవర్ ను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. -హై జవాని- చిత్రం యూత్ ఫుల్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోంది. వరుణ్ ధావన్ వంటి ఎనర్జిటిక్ హీరో సరసన పూజా నటిస్తుండటంతో ఇద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందనే అంచనా లుంటాయి. ముఖ్యంగా పాటల్లో , కొన్ని కీలక సన్నివేశాల్లో పూజా గతంలో ఎన్నడూ లేని విధంగా గ్లామర్ యాంగిల్‌ను ప్రదర్శించబోతోందని బాలీవుడ్ మీడియా కోడై కూస్తోంది. నటనకే పరిమితం కాకుండా బోల్డ్ యాంగిల్ తోనైనా తాను అనుకున్నది సాధించలనే పట్టుదలతో కనిపిస్తుంది. ప్రచార చిత్రాలు , లీక్ అయిన వార్తలు మాత్రం అమ్మడు అందాల ఆరబోతపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నాయి. సౌత్ సినిమాల్లో పద్ధతిగా కనిపించి మెప్పించిన భామ నార్త్ మార్కెట్ కోసం ఇలా రూట్ మార్చడం చర్చనీ యాంశమైంది. మారుతోన్న ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా తనను తాను కొత్తగా ఆవిష్కరించుకోవడంలో భాగంగానే ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.వరుస పరాజయాలు ఎదురైనప్పుడు నటీనటులు ఇమేజ్‌ను మార్చుకోవడం సహజం. పూజా హెగ్డే కూడా అదే బాటలో పయనిస్తుంది. -హై జవాని- సక్సెస్ ఆమె బాలీవుడ్ కెరీర్‌కు ఊపిరి పోయడమే కాదు. మళ్ళీ టాలీవుడ్ మేకర్స్ దృష్టిని ఆకర్షించడానికి దోహదప డుతుందని అమ్మడు బలంగా నమ్ముతుంది. షూటింగ్ దశలోనే ఇంతటి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా విడుదల తర్వాత ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో చూడాలి. మొత్తంగా పూజా హెగ్డే కెరీర్ గ్రాఫ్‌ను మళ్ళీ పైకి తీసుకెళ్లడానికి సర్వశక్తులూ ఒడ్డుతోంది. హద్దులు చెరిపేయడం అనేది గ్లామర్ పరంగానే కాకుండా వైవిధ్యమైన పాత్రలు చేయడానికి సిద్ధంగా ఉందనే సంకేతంగా భావించొచ్చు.





స్టైలిష్ కో-ఆర్డ్ ఫోటోషూట్‌లో కావ్య థాపర్ గ్లామర్‌ను ప్రసరిస్తుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com